teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక


ములుగు | సంపుటి : 03 | సంచిక : 98 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 2 ఆగస్టు 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## టీఎస్ సెట్ ఎగ్జామ్ తేదీల్లో స్వల్ప మార్పు

**ఆగస్టులో ఉండాల్సిన పరీక్షలు సెప్టెంబర్‌లో నిర్వహణ**

**ఈ మేరకు ప్రకటన విడుదల చేసిన అధికారులు**




హైదరాబాద్, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): టీఎస్ సెట్ (స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్) ఎగ్జామ్ షెడ్యూల్ మారింది. ఆగస్టులో నిర్వహించాల్సిన పరీక్షలను సెప్టెంబర్‌లో పెడ్తామని సెట్ అధికారులు ప్రకటించారు. ఈ మేరకు పరీక్షల రీషెడ్యూల్ రిలీజ్ చేశారు. గతంలో ఈనెల 28

మిగతా 2 లో



## సుప్రీం కోర్టు ఆదేశాల అమలులో ముందుంటాం

**ఉద్యోగ నియామకాల్లో వర్గీకరణ అమలు చేస్తాం**

**ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ తీర్పుపై సీఎం ప్రకటన**

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): ఉద్యోగ నియామకాల్లో వర్గీకరణ అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల అమలులో ముందు ఉంటామని సీఎంతెలిపారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణపై సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే విద్యాసంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రవేశాల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉప కేటగిరీ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 6:1 మెజారిటీతో సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని

మిగతా 2 లో



ధరణి పోర్టల్ పేరు భూమాత పోర్టల్‌గా మార్పు


# ధరణి ఇక 'భూమాత'..!

ధరణి
తెలంగాణ ప్రభుత్వం

## అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ విడుదలకు నిర్ణయం

**కొత్త రేషన్ కార్డుల జారీకై సబ్ కమిటీ ఏర్పాటు**

**తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు**



హైదరాబాద్, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం కేబినెట్ భేటీ అయింది. ఇందులో పలు కీలక అంశాలపై సుదీర్ఘపాటు చర్చించారు. ధరణి పోర్టల్ ను భూమాత పోర్టల్ గా మారుస్తూ తెలంగాణ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇండియా స్కిల్స్ వర్శిటీ బిల్లుకు ఆమోదముద్ర వేసింది. జాబ్ క్యాలెండర్ కు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో జాబ్

మిగతా 2 లో



## హాస్టల్లో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

**హన్మకొండ జిల్లాలో విషాదం**

**కాలేజీ వద్ద మృతురాలి బంధువులు ఆందోళన.. ఫర్నిచర్ ధ్వంసం**

హన్మకొండ, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): హన్మకొండ జిల్లాలో విషాదం నెలకొంది. ములుగు జిల్లా కమలాపూర్ గ్రామానికి చెందిన భవానీ అనే ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని హన్మకొండ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ అకాడమీ స్టూడెంట్ హాస్టల్లో అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గుర్తించిన హాస్టల్ సిబ్బంది విద్యార్థిని హాస్పిటల్ కు ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చనిపోయినట్లు తెలిపారు డాక్టర్లు. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు కాలేజీ దగ్గరకు చేరుకుని ఆందోళన చేశారు. తమ కూతురు మృతికి కారణం చెప్పాలంటూ ధర్నా చేశారు. కాలేజీలోని ఫర్నీచర్ ను ధ్వంసం చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సుప్రీం కోర్టు పచ్చ జెండా

**సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం : మందకృష్ణ మాదిగ**

**విద్యాసంస్థల్లో వర్గీకరణనుసరించి రిజర్వేషన్ చేయాలి**

న్యూ ఢిల్లీ, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): ఎస్సీ, ఎస్టీ వర్గీకరణల్లో వర్గీకరణకు సుప్రీం కోర్టు పచ్చ జెండా ఊపింది. ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం

మిగతా 2 లో

## యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి పునాది

**బిల్లుకు ఆమోదముద్ర పడిన కొద్దిసేపటికే భూమిపూజ**

**యూనివర్సిటీ నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న సీఎం**

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి పునాదిపడింది. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీరాన్పేట్లో స్కిల్ యూనివర్సిటీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమిపూజ నిర్వహించారు. స్కిల్ యూనివర్సిటీకి సంబంధించిన బిల్లుకు శాసన సభలో ఆమోదముద్ర పడిన కొద్దిసేపటికే భూమిపూజ నిర్వహించారు.

రంగారెడ్డి, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): నెట్ జీరో సిటీ పరిధిలో ప్రతిపాదిత స్కిల్ వర్సిటీ తోపాటు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, మోడ్రన్ స్కూల్, ప్రైమరీ హెల్త్ సెంటర్, కమ్యూనిటీ సెంటర్లకు కూడా సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అనంతరం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ

మిగతా 2 లో




## అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన



**ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు**

**స్పీకర్ గడ్డం ప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం**

**పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బయటకు తీసుకచ్చిన మార్షల్స్**

హైదరాబాద్, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణ అసెంబ్లీలో గురువారం హైడ్రామా చోటుచేసుకుంది. అసెంబ్లీ నుంచి పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ బయటకు తీసుకొచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ

మిగతా 2 లో



**రాష్ట్రంలో ఈ నెల 5 నుంచి 9 వరకు**

## స్వచ్ఛదనం – పచ్చదనం

**కార్యక్రమ ఏర్పాట్లకు జిల్లాల కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు జారీ**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించాలని సీఎస్ శాంతి కుమారి తెలిపారు. ఈ కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు జారీ చేశారు.

హైదరాబాద్, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఉన్న మౌళిక సమస్యలను పరిష్కరించాలన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమ నిర్వహణ పై గురువారం అన్ని జిల్లా కలెక్టర్లతో సీఎస్ సచివాలయంలో వీడియో

మిగతా 2 లో

## రాష్ట్రంలో మహిళలు భయంతో బతకాల్సిన పరిస్థితి నెలకొంది

**మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయి**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డ బీఆర్ఎస్ మాజీ మంత్రి సబిత**

**ఇదే విషయాన్ని ప్రస్తావించా.. మైక్ ఇవ్వడానికి భయపడుతున్నారు**

హైదరాబాద్, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాజీ సీఎం కేసీఆర్ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని ఎంతసేపూ అదే పనిలా కాకుండా సమర్థ పాలనపై దృష్టి సారించాలని మాజీ

మిగతా 2 లో



## కొత్త రేషన్ కార్డులపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం



**రేషన్ కార్డులకు విధివిధానాలు రూపొందించనున్న కమిటీ**

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఇప్పటికే నిఖత్ జరీన్‌కు, మహ్మద్ సిరాద్‌కు గ్రూపు-1 ఉద్యోగం, హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఇంటి స్థలం ఇవ్వాలని నిర్ణయం

మిగతా 2 లో

## రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు



**ఆగస్ట్ 01 నుంచి 4 వరకు భారీ నుండి మోస్తారు వర్షాలు**

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరించిన వాతావరణ శాఖ**

.. వివరాలు 2లో

## అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల

**ఆగస్టు 18 వరకు దరఖాస్తులకు గడువు నిర్ణయం**

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ నుంచి ప్రవేశాల నోటిఫికేషన్ విడుదలైంది. దూర విద్యా ద్వారా డిగ్రీ, పీజీ, లైబ్రరీ సైన్స్, పీజీ డిప్లొమా, పలు సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్ లైన్‌లో దరఖాస్తులను

మిగతా 2 లో

# ఆగస్టు 1 నుండి ఫాస్టాగ్ కొత్త నిబంధనలు

## ఫాస్ట్ ట్యాగ్‌ల కేవైసీని అక్టోబర్ 30 లోగా చేయాలి : ఎన్పీసీఐ

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): ఫాస్టాగ్ కొత్త నిబంధనలు ఆగస్టు 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. టోల్ గేట్ల వద్ద జాప్యం లేకుండా ఆన్ లైన్‌లో త్వరితగతిన రుసుములు చెల్లించేందుకు ఫాస్టాగ్‌ను వాహనదారులు ఉపయోగిస్తున్నారు. ఇప్పటి వరకు ఎలా ఉన్నా ఇక నుంచి ఫాస్ట్ ట్యాగ్‌లు లేని వాహనాల నుండి ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తారు. అందువల్ల వాహనాలకు ఫాస్ట్ ట్యాగ్ అనేది తప్పనిసరి. ఫాస్ట్ ట్యాగ్‌పై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తాజా ఉత్తర్వులతో ఆగస్ట్ 1వ తేదీ నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. మూడు నుంచి ఐదు సంవత్సరాల క్రితం జారీచేసిన అన్ని ఫాస్ట్ ట్యాగ్‌ల కేవైసీని అక్టోబర్ 30 లోగా పూర్తి చేయాలని ఎన్పీసీఐ కోరింది. ఐదు సంవత్సరాల క్రితం జారీ చేసిన ఫాస్ట్ ట్యాగ్‌లను తప్పనిసరిగా మార్చుకోవలసి ఉంటుందని తెలిపింది. ప్రతీ వాహనదారుడు తమ ఫాస్ట్ ట్యాగ్ జారీ చేసిన తేదీని చెక్ చేసుకొని, కేవైసీని పూర్తి చేయడంతో పాటు ఐదు సంవత్సరాలు పూర్తయిన వాటి స్థానంలో కొత్తగా అప్డేట్ చేసుకోవాలని ఎన్పీసీఐ పేర్కొన్నది. దీనికి చివరి తేదీ ఈ సంవత్సరం అక్టోబర్ 31గా నిర్ణయించారు. సంబంధిత వాహన ఫాస్ట్ ట్యాగ్ తప్పనిసరిగా తమ వ్యక్తిగత మొబైల్ నంబరుకు లింక్ చేయాలని, కేవైసీ చివరి తేదీ వరకు వేచిచూడకుండా వీలైనంత తొందరగా వాహనదారులను అప్డేట్ చేసుకోవలసిందిగా ఎన్పీసీఐ తాజాగా ఆదేశాలు జారీ చేసింది.

# సుప్రీం కోర్టు ఆదేశాల అమలులో ముందుంటాం

మొదటి పేజీ తరువాయి

ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. అయితే ఈనేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పుతో సీఎం రేవంత్ రెడ్డి ని మాదిగ ఎమ్మెల్యేలు, మంత్రులు దామోదర రాజనర్సింహ, కడియం శ్రీహరి, కవ్వంపల్లి, వేముల వీరేశం,శామ్యూల్ శాలువా కప్పి సన్మానించారు. స్వీట్లు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో గాని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో గాని ఏ బి సి డి వర్గీకరణ మీద మాదిగ, మాదిగ ఉపకులాల యువకులు పోరాటాలు చేయడం జరిగిందని తెలిపారు. వారి పోరాటాల ఫలితం ఒకనాడు ఇదే శాసనసభలో మాదిగ ఉపకులాల వర్గీకరణ కోసం వాయిదా తీర్మానం ఇస్తే నాతోపాటు ఆనాటి శాసనసభ్యులు సంపత్ కుమార్ ని కూడా ఈ సభ నుంచి బహిష్కరించడం జరిగిందని గుర్తుచేశారు. అఖిలపక్షాన్ని తీసుకెళ్తామని చెప్పి తీసుకపోకుండా మాదిగ సోదరులను మోసం చేయడం జరిగింది బీఆర్ఎస్ అన్నారు. కానీ డిసెంబర్ 3, 2023 నాడు ప్రజా ప్రభుత్వం కోర్టులో వాదన వినిపించిందని తెలిపారు. రాజ్యాంగ ధర్మాసనానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. ఏడు మంది చర్చిలలో ఆరు మంది జడ్జిలు రాష్ట్రాలకు ఏబిసిడి వర్గీకరణ చేయడానికి అనుమతించిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫుననే స్పష్టమైన ప్రకటన చేస్తున్న దేశంలోనే అందరికంటే ముందుభాగాన నిలబడి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ అమలు చేస్తామన్నారు. ఉద్యోగ నియామకాల్లో వర్గీకరణ అమలు చేస్తామన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల అమలులో ముందు ఉంటామని సీఎం తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కు మాదిగ, మాల ఉప కులాలకు వర్గీకరణకు వాయిదా తీర్మానం ఇస్తే గత ప్రభుత్వం సంపత్ కుమార్ ను సస్పెండ్ చేసిందన్నారు. 2023 డిసెంబర్ 23న ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, దామోదర రాజనర్సింహ అడ్వకెట్ జనరల్ ను సుప్రీంకోర్టుకు పంపించారని అన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు లో న్యాయ నిపుణులతో వాదనలు వినిపించారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నం ఫలించిందని అన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నా అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఏబీసీడీ వర్గీకరణ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఇప్పుడు అమలులో ఉన్న ఉద్యోగ నోటిఫికేషన్ లో కూడా మాదిగ, మాల ఉప కులాలకు రెజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని తెలిపారు. ఇందుకోసం అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకోస్తామన్నారు.

# ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సుప్రీం కోర్టు పచ్చ జెండా

మొదటి పేజీ తరువాయి

చారిత్రక తీర్పు ఇచ్చింది. సుప్రీంకోర్టు తీర్పుపై మందకృష్ణ మాదిగ స్పందించారు. ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం. ఏనాటికైనా ధర్మమే గెలుస్తుందని నిరూపితమైంది. ఈ పోరాటంలో చాలా మంది అసువులబాశారు. సుప్రీం కోర్టులో న్యాయం గెలిచింది. ఈ విజయం కోసం 30 ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్నాం. ఎన్ని కష్టాలు ఎదురైనా అంకిభావంతో జాతి పోరాడింది. వర్గీకరణ పోరాటాన్ని నీరుగార్చుందుకు యత్నించారు. ఎస్సీ వర్గీకరణకు తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులకు ధన్యవాదాలు. ఈ తీర్పుతో తెలంగాణలో 11శాతం, ఆంధ్రప్రదేశ్‌లో ఏడు శాతం మాదిగలకు రిజర్వేషన్ దక్కే అవకాశం ఉంది. ఉద్యోగ నోటిఫికేషన్లలో వర్గీకరణ వెంటనే చేయాలి. విద్యాసంస్థల్లో కూడా వర్గీకరణకు అనుకూలంగా రిజర్వేషన్ చేయాలి. ఉద్యమాన్ని దెబ్బతీసే కుట్రలు జరిగాయి. కొంతమంది వెన్నుపోటు పొడిచారు. సమాజం యావత్తు మాదిగల వైపు నిలబడింది. ఎన్నో రాజకీయ పార్టీలు, వ్యక్తులు మా వైపు నిలబడ్డారు. న్యాయాన్ని, ధర్మాన్ని బతికించడం కోసం మా వైపు నిలబడ్డ అందరికీ ధన్యవాదాలు. సమాజంలో పెద్దలు, మీడియాకు కృతజ్ఞతలు. అణగారిన వర్గాల వైపు, పేద వర్గాల వైపు న్యాయం నిలబడింది. ప్రధాన న్యాయమూర్తుల తో పాటు, ఇతర న్యాయమూర్తులకు కృతజ్ఞతలు. మాకు అండగా నిలబడ్డ ప్రధాని మోదీ, అమిత్ షా, భుజాన వేసుకుని మా వైపు ఉన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డిలకు కృతజ్ఞతలు. సుప్రీంకోర్టు తాజా తీర్పును తెలుగు రాష్ట్రాల్లో విద్యా, ఉద్యోగ నియామకాల్లో అమలు చెయ్యాలి. ప్రభుత్వాల దగ్గర ఎస్సీ, ఎస్టీ జనాభా లెక్కలు ఉన్నాయి. కాబట్టి ప్రస్తుతం ఉన్న ఉద్యోగ నియామకాల్లో కూడా అమలు చెయ్యాలి అని అన్నారు.

# కొత్త రేషన్ కార్డులపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

తీసుకున్నారు. అంతేగాకుండా కొత్త రేషన్ కార్డులు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బిల్లు, జీహెచ్ఎంసీలో విలీనం కానున్న ఔటర్ లోపలి మున్సిపాలిటీలు, మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు, జాబ్ క్యాలెండర్, హెచ్ఎండీఏ పరిధి విస్తరణ, రైతు భరోసారి విధివిధానాలు వంటి తదితర అంశాల ఆమోదంపై సుదీర్ఘంగా చర్చించారు. చర్చల అనంతరం కొత్త రేషన్ కార్డుల జారీపై నిర్ణయం తీసుకున్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నది. ఈ కమిటీ రేషన్ కార్డుల జారీకి విధివిధానాలు రూపొందించనున్నది. మంత్రి ఉత్తమ్ అధ్యక్షతన సబ్ కమిటీ ఏర్పాటు చేశారు. ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు విడి విడిగా ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు.

# రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడనున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. 2024, ఆగస్ట్ ఒకటో తేదీ సాయంత్రం తర్వాత పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని వార్నింగ్ ఇచ్చింది వెదర్ డిపార్ట్ మెంట్. ఇక హైదరాబాద్ సిటీలోనూ మోస్తరు వానలు పడతాయని సిటీ శివారు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో జల్లులు పడతాయని వెల్లడించింది వాతావరణ శాఖ. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా ఉంటాయని వర్షం సమయంలో చెట్ల కిందకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేసింది. ఆగస్ట్ ఒకటి నుంచి ఆగస్ట్ 4వ తేదీ వరకు తెలంగాణతోపాటు హైదరాబాద్ సిటీలోనూ ఇలాంటి వాతావరణమే ఉంటుందని అక్కడక్కడ భారీ వర్షాలు మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు వానలు ఇంకొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో జల్లులు పడతాయని వివరించింది వాతావరణ శాఖ. నైరుతి రుతుపవనాలు వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 364 మిల్లీమీటర్లుగా ఉంటే ఇప్పటి వరకు 461 మిల్లీమీటర్ల వర్షపాతనం నమోదైంది. ఇది సాధారణం కంటే 27 శాతం అధికంగా అని స్పష్టం చేసింది హైదరాబాద్ వాతావరణ శాఖ.

# టీఎస్ సెట్ ఎగ్జామ్ తేదీల్లో స్వల్ప మార్పు

మొదటి పేజీ తరువాయి

నుంచి 31 వరకూ జరగాల్సిన పరీక్షలను సెప్టెంబర్ 10 నుంచి 13 వరకూ నిర్వహించనున్నట్టు అధికారులు ప్రకటించారు. ఎడిట్ ఆప్షన్‌ను ఆగస్టు 23,24 తేదీల్లో నిర్వహిస్తామని, హాల్ టికెట్లను సెప్టెంబర్ 2 నుంచి డౌన్ లోడ్ చేసుకోవచ్చని వెల్లడించారు. అయితే, యూజీసీ నెట్ పరీక్షల నేపథ్యంలో రీషెడ్యూల్ ఇచ్చినట్టు అధికారులు పేర్కొన్నారు.

# ధరణి ఇక 'భూమాత'..!

మొదటి పేజీ తరువాయి

క్యాలెండర్ ను విడుదల చేయనున్నారు. కొత్త రేషన్ కార్డులను త్వరితగతిన మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది.



**కేబినెట్ యొక్క ముఖ్య నిర్ణయాలు:**

- ఇండియా స్కిల్స్ వర్శిటీ బిల్లుకు మంత్రివర్గం ఆమోదం.
- కొత్త రేషన్ కార్డుల జారీపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు. (సబ్ కమిటీలో డిప్యూటీ సీఎం భట్టి, ఉత్తమ్, దామోదర రాజనర్సింహ.)
- జాబ్ క్యాలెండర్ కు కేబినెట్ ఆమోదం.
- క్రీడాకారులు ఈషా సింగ్, నిఖత్ జరీన్, మహమ్మద్ సిరాజ్ కు హైదరాబాద్ లో 600 చదరపు గజాల ఇంటి స్థలం కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- నిఖత్ జరీన్ కు, సిరాజ్ కు గ్రూప్ 1 స్థాయి ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయించింది.
- గౌరవెల్లి ప్రాజెక్ట్‌కు రూ.437 కోట్లు కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం.
- కొత్త ఆరోగ్య శ్రీ కార్డులను జారీ చేయాలని నిర్ణయం.
- జీహెచ్ఎంసీ పరిధిని ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించే ముసాయిదా బిల్లుకు ఆమోదం.
- గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రొఫెసర్ కోదండరామ్ రెడ్డి, అమీర్ అలీఖాన్.
- కేరళలో జరిగిన విషాదంపై తెలంగాణ కేబినెట్ సంతాప తీర్మానం. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేసింది. ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయక చర్యలను అందించేందుకు ముందుకు వచ్చింది.
- ఇటీవల విధి నిర్వహణలో మరణించిన ఇంటెలిజెన్స్ డీజీ రాజీవ్ రతన్ కుమారుడు హరి రతన్ కు మున్సిపల్ కమిషనర్ ఉద్యోగం ఇవ్వాలని కేబినెట్ తీర్మానం.
- ఇటీవల విధి నిర్వహణలో చనిపోయిన అడిషనల్ డీజీ పి.మురళి కుమారుడికి డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయం.
- గౌరవెల్లి ప్రాజెక్టు పరిధిలో అసంపూర్తిగా నిలిచిపోయిన కుడి, ఎడమ కాల్వలు పూర్తి చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దాదాపు రెండు వేల ఎకరాల భూసేకరణ చేపట్టేందుకు అవసరమయ్యే నిధులతో సవరణ అంచనాలను రూపొందించాలని నిర్ణయం తీసుకుంది.
- నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు తగిన చర్యలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. రెండో విడతగా చెల్లించాల్సిన బకాయిల చెల్లింపులకు ఆమోదం తెలిపింది. అవసరమైతే ఇథనాల్, విద్యుత్తు ఉత్పత్తికి అక్కడి ఫ్యాక్టరీల్లో ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని చర్చించింది.
- మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటిని శామీర్ పేట చెర్వు నింపి, అక్కడి నుంచి హైదరాబాద్ లో ఉన్న జంట జలాశయాలు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ కు తరలించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తం 15 టీఎంసీలను తరలించి అందులో 10 టీఎంసీలతో చెర్వులు నింపి, మిగతా నీటిని హైదరాబాద్ తాగునీటి అవసరాలకు వినియోగించాలని నిర్ణయించారు.

# యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి పునాది



మొదటి పేజీ తరువాయి

శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని, యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలన్న గొప్ప ఆశయంతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నాం. అభివృద్ధిలో భాగంగా ఇక్కడ మరో నగరాన్ని నిర్మించాలని నిర్ణయించాం. నగరం నిర్మాణం జరగాలంటే, విద్య, వైద్యం, ఉపాధి లాంటి మౌలిక వసతులు కల్పించాలి. అందుకే శాసనసభలో బిల్లును ఆమోదించి ఇక్కడ స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, మోడ్రన్ స్కూల్, ప్రైమరీ హెల్త్ సెంటర్, కమ్యూనిటీ సెంటర్ లకు శంకుస్థాపన చేసుకున్నాం. ఆనాడు దేశంలో ఎడ్యుకేషన్, ఇరిగేషన్ కు జవహర్ లాల్ నెహ్రూ ప్రాధాన్యతనిచ్చారు. గోదావరి, కృష్ణా జలాలను హైదరాబాద్ కు తీసుకొచ్చింది కాంగ్రెస్. స్కిల్ యూనివర్సిటీ ద్వారా లక్షలాది మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్ అందించనున్నాం. శిక్షణతో పాటు ఉద్యోగాన్ని ఇచ్చేందుకు పలు కంపెనీలు ముందుకు వచ్చాయి. స్కిల్ యూనివర్సిటీలో అడ్మిషన్ వచ్చిందంటే ఉద్యోగం గ్యారంటీ మీ భవిష్యత్తు కోసం ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోంది. ఈ ప్రాంతం ఫ్యూచర్ సిటీగా మారబోతుంది. న్యూయార్క్ నగరం కంటే అధునాతన నగరాన్ని ఇక్కడ నిర్మించబోతున్నాం. ఇక్కడ హెల్త్ టూరిజం హబ్, స్పోర్ట్స్ హబ్ ను అభివృద్ధి చేస్తాం. భూమి కోల్పోయిన పేదలకు నేను మాట ఇస్తున్నా ఎవరూ అధైర్యపడొద్దు మీ భవిష్యత్ కు భరోసా కల్పిస్తాం. మీ పిల్లలకు నైపుణ్య శిక్షణ ఇప్పించి ఉద్యోగాలు కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. ఇక్కడి నుంచి ఎయిర్ పోర్టు వరకు 200 ఫీట్స్ రోడ్డు నిర్మాణం చేస్తాం, మెట్రోను అందుబాటులోకి తీసుకోస్తాం. ఆనాడు ఔటర్ రింగ్ రోడ్డు రాజశేఖర్ రెడ్డి తీసుకొచ్చారు. ఇప్పుడు కోమటిరెడ్డి ఆధ్వర్యంలో రీజనల్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేయబోతున్నాం. రీజనల్ రింగ్ రోడ్డు పనులను మూడు నెలల్లో ప్రారంభిస్తాం అని అన్నారు.

# అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన

మొదటి పేజీ తరువాయి

సీఎం భట్టివిక్రమార్కలు మహిళా ఎమ్మెల్యేలను కించపరిచేలా మాట్లాడినందుకు నిరసనగా బీఆర్ఎస్ శాసనసభ్యులు నల్లబ్యాడ్జీలు ధరించి సభకు హాజరయ్యారు. మరోవైపు మంత్రి శ్రీధర్ బాబు గురువారం శాసనసభలో యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ బిల్‌ను ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై సభలో చర్చ చేపట్టారు. అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభలో నిరసనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన కొనసాగించడంపై స్పీకర్ గడ్డం ప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వారి నిరసనను కొనసాగించారు. ఈ క్రమంలోనే వెల్‌లోకి దూసుకెళ్లి బైఠాయించారు. ఈ క్రమంలోనే కేటీఆర్‌తో సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ బయటకు తీసుకొచ్చారు. కేటీఆర్‌ను అసెంబ్లీ వెలుపల మార్షల్స్ ఎత్తుకెళుతున్న వీడియో వైరల్‌గా మారింది. అందులో కేటీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేటీఆర్‌తో సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ వెలుపల పోలీసులు అదుపులోకి తీసుకుని వారిని అక్కడి నుంచి తరలించారు. కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోయిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఆడబిడ్డలకు క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అప్పటి వరకు విడిచిపెట్టేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. మరోవైపు హరీశ్‌రావు మాట్లాడుతూ శాసనసభలో విపక్షం గొంతునొక్కారన్నారు. ఎన్నిసార్లు కోరినా స్పీకర్ మైక్ ఇవ్వడం లేదని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఇన్ని ఆంక్షలు లేవని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో లేని ఆంక్షలు శాసనసభలో చూడడం దురదృష్టకరమన్నారు.

# రాష్ట్రంలో మహిళలు భయంతో బతకాల్సిన పరిస్థితి నెలకొంది

మొదటి పేజీ తరువాయి

మంత్రి సబితా ఇంద్రారెడ్డి సూచించారు. తెలంగాణ భవన్లో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో కలిసి ఆమె గురువారం మీడియాతో మాట్లాడారు. సభలో సీఎం తీరు చూస్తుంటే కేసీఆర్ను తిట్టేందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా పాలన, ఇందిరమ్మ పాలన అని ఊదర గొడుతున్నారు. మహిళలకు ఇచ్చిన హామీలే ఆ పార్టీని అధికారంలోకి తెచ్చాయి. అలాంటి ప్రస్తుతం రాష్ట్రంలో మహిళలు భయంతో బతకాల్సిన పరిస్థితి ఏర్పడింది. మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. ఇదే విషయాన్ని అసెంబ్లీలో నేను ప్రస్తావించా. మాకు మైక్ ఇవ్వడానికే సీఎం భయపడుతున్నారు. మేము నాలుగున్నర గంటలు నిల్చున్నా మాకు మైక్ ఇవ్వలేదు. ఆడబిడ్డలు నిలబడితే వాళ్లు ఆనందిస్తున్నారు.' అంటూ సబిత ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఇప్పటివరకూ ఎంతో మంది సీఎంలను చూశామని వైఎస్, చంద్రబాబు, కేసీఆర్ మహిళలకు సభలో ఎంతో గౌరవం ఇచ్చారని మాజీ మంత్రులు సబిత, సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. వారు మహిళలు ఇన్ని గంటల తరబడి సభలో నిలబడితే స్పందించేవారని కానీ ప్రస్తుతం అలా జరగడం లేదని మండిపడ్డారు. స్పీకర్ కూడా మా వినతిని పట్టించుకోలేదు. సభలో 9 మంది మహిళా సభ్యులున్నా మాట్లాడే అవకాశమే రావట్లేదు. ఎస్సీ వర్గీకరణపై మాట్లాడదామనుకుంటే మైక్ ఇవ్వలేదు. బీఆర్ అంబేద్కర్ దళితుల గురించే కాదు మహిళలకు ఇవ్వాల్సిన గౌరవం గురించీ కూడా చెప్పారు. దాన్ని కనీసం పాటించలేదు. డిప్యూటీ సీఎం భట్టి సీఎల్పీ పదవి మా వల్ల పోయిందని అంటున్నారు. పార్టీ మారటం పెద్ద నేరమైతే అసెంబ్లీలో ఇప్పుడున్న వాళ్లలో ఎంతమంది పార్టీలు మారలేదు.? సభలో లేని ఎమ్మెల్సీ కవిత పేరు సీఎం తీసుకోవడం ఎంతవరకు కరెక్టు. ఆడబిడ్డలను అవమానించడమే సీఎంకు నిత్యకృత్యంగా మారింది. ఆ పదవికున్న గౌరవాన్ని రేవంత్ కాపాడుకుంటే మంచిది. రాహుల్ గాంధీ రేవంత్ను నమ్ముకున్నారు. ఆయన బతుకు సికింద్రాబాద్ స్టేషన్ చేస్తారా, మహిళలపై అత్యాచారాల గురించి రేపు సభలో లేవనెత్తుతాం. మాకు మాట్లాడే అవకాశం ఇవ్వాలి. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలి. మాకు అండగా నిలిచిన మహిళ లోకానికి, బీఆర్ఎస్ శ్రేణులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం అని సబిత పేర్కొన్నారు.

# రాష్ట్రంలో ఈ నెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం - పచ్చదనం

మొదటి పేజీ తరువాయి

కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.స్వచ్ఛదనం - పచ్ఛదనం కార్యక్రమం ద్వారా ఇంటింటికి మొక్కలు పంపిణీ చేయడమే కాకుండా అవి మనుగడ సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. పల్లె ప్రకృతి వనాలు, అర్బన్ ఫారెస్ట్ పార్కులతో పాటు ఇతర వనాల నిర్వహణ సరిగా ఉండేలా చూడాలన్నారు. గతంలో నాటిన మొక్కలలో ఏవైనా ఎండిపోయి ఉంటే వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటాలన్నారు. దోమల నివారణ, అంటువ్యాధులు అరికట్టే చర్యలు, ఇంకుడు గుంతల నిర్వహణ, కొత్త ఇంకుడు గుంతల ఏర్పాట్లపై అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. ఇంకుడు గుంతల అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఐదు రోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలో రోజుకో ప్రత్యేకత ఉండేలా ప్రణాళిక రూపొందించి వాటి వివరాలను ఇప్పటికే కలెక్టర్లకు పంపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ నెల 5న ప్రజల భాగస్వామ్యంతో ర్యాలీలు నిర్వహించడం, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించడం వంటి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అధికారులు ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం మంచి అవకాశమని మన రాష్ట్రంలో చాలా మంది కలెక్టర్లు యువకులే ఉన్నారని వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సీఎస్ సూచించారు.

ప్రతి గ్రామంలో చురుకుగా ఉన్న యువజనల సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, రాజకీయ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలన్నారు.

# అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల

మొదటి పేజీ తరువాయి

నవంర్పించవచ్చని అధికారులు తెలిపారు. ఆగస్టు 18, 2024 వరకు గడువు విధించారు. www.braouonline.in, www.braou.ac.in వెబ్ సైట్ లోకి వెళ్లి వివరాలను చెక్ చేసుకోవచ్చు.

**కోర్సుల వివరాలు:**

డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు ఉన్నాయి. ఇక పీజీలో ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంబీఏ కోర్సులతో పాటు పీజీ డిప్లొమాలో బీఎల్ఐఎస్సీ (BLISc), ఎంఎల్ఐఎస్సీ (MLISc) సహా పలు సర్టిఫికేట్ కోర్సులను పేర్కొంది. ఇందులో అడ్మిషన్లు పొందేందుకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుల స్వీకరణ ఆగస్టు 18,2024 తేదీతో ముగియనుంది. ట్యూషన్ ఫీజును ఆన్‌లైన్ విధానంలో చెల్లించాలని నోటిఫికేషన్ లో అధికారులు పేర్కొన్నారు. క్రెడిట్/డెబిట్ కార్డు ద్వారా ఏపీ, టీఎస్ ఆన్లైన్ సెంటర్ ల ద్వారా చెల్లించవచ్చు.

**అర్హతల వివరాలు:**

అండర్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్ (డిగ్రీ) కు 10ం2 / ఇంటర్మీడియట్ / ఐటీఐలో ఉత్తీర్ణత సాధించాలి. బీఏ, బీకాం, బీఎస్సీ - తెలుగు / ఇంగ్లిష్ మీడియం, బీఏ, బీఎస్సీ - ఉర్దూ మీడియంలలో ఉన్నాయి. ఇక పీజీ కోర్సులైన ఎంఏ / ఎంఎస్సీ / ఎంకాంలకు గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణతను అర్హతగా పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో ఉన్నాయి.

**ముఖ్యమైన తేదీల వివరాలు:**

- దరఖాస్తులు ప్రారంభం - 27 -జులై-2024.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: 18.ఆగస్టు,2024.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- అధికారిక వెబ్ సైట్ - https://www.braouonline.in
- అప్లికేషన్ లింక్ - https://online.braou.ac.in/PG/PGFirstHome
- ఆయా కోర్సులను బట్టి ఫీజులను ఖరారు చేశారు. అధికారిక సైట్ లో ఆ వివరాలను కూడా పొందుపరిచారు. జిల్లాల్లోనూ స్టడీ సెంటర్లలో కూడా పేర్లు నమోదు చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం వర్సిటీ హెల్ప్‌లైన్ నెంబర్లు 7382929570, 7382929580, 7382929590 & 7382929600 సంప్రదించవచ్చు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## బంగ్లాలో రిజర్వేషన్ల చిచ్చు

పొరుగున ఉన్న బంగ్లాదేశ్ అల్లర్లతో అట్టుడుకుతోంది. ఉద్యోగ నియామకాలకు సంబంధించిన రిజర్వేషన్లను సంస్కరించి, ప్రతిభకు పట్టం కట్టాలన్న డిమాండ్‌తో రెండువారాల క్రితం విశ్వవిద్యాలయాల విద్యార్థులు ప్రారంభించిన ఉద్యమం చినికి చినికి గాలివానగా మారి సాధారణ ప్రజాజీవనానికి పెను విఘాతంగా పరిణమించింది. శాంతియుతంగా జరుగుతున్న విద్యార్థుల ఆందోళన ఒక్కసారిగా అదుపు తప్పి, హింసాత్మకంగా మారడంతో పరిస్థితి చేజారింది. ఫలితంగా వందలాది విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారు. అటు విద్యార్థులు, ఇటు ప్రభుత్వమూ తమదే పైచేయి కావాలన్న ధోరణితో మొండిపట్టు ప్రదర్శిస్తుండటంతో రానురాను ఈ రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమం రావణకాష్టంలా మారే ప్రమాదం కనబడుతోంది.

బంగ్లాదేశ్ విముక్త పోరాటంలో ప్రాణాలు కోల్పోయినవారి పిల్లలకు, వారి మనవళ్లు, మనవరాళ్లకు 30 శాతం రిజర్వేషన్లు దశాబ్దాల తరబడి కొనసాగుతున్నాయి. అప్పటి దేశాధ్యక్షుడు ముజిబుర్ రహ్మాన్ 1972లోనే ఈ రిజర్వేషన్లు కల్పించారు. ఈమేరకు విముక్త పోరాటంలో అసువులు కోల్పోయిన వేలాది మంది సంతానానికి ఈ రిజర్వేషన్లు అమలవుతున్నాయి. వీటికితోడుగా స్థానిక పరిపాలన జిల్లాలవారికి 10 శాతం, మహిళలకు 10 శాతం, మైనారిటీ తెగలవారికి ఐదు శాతం, దివ్యాంగులకు ఒక శాతం రిజర్వేషన్లను తర్వాతి ప్రభుత్వాలు జత చేశాయి. దీంతో రిజర్వేషన్ల శాతం 56కు చేరింది. ఈ పద్ధతిపై గతంలోనూ ఎన్నోసార్లు నిరసనలు, ఆందోళనలు చోటు చేసుకున్నాయి. పర్యవసానంగా ప్రధాని హసీనా 2018లో రిజర్వేషన్లను రద్దు చేశారు. అయితే మొన్న జూన్‌లో స్వాతంత్ర్య సమరయోధుల సంతానానికి రిజర్వేషన్లు కొనసాగించాలంటూ సుప్రీం కోర్టు తీర్పునివ్వడంతో మళ్లీ చిచ్చు రాజుకుంది. బంగ్లాదేశ్ ప్రధానిగా వరుసగా నాలుగోసారి బాధ్యతలు చేపట్టిన షేక్ హసీనా మొక్కగా ఉండగానే ఉద్యమాన్ని తుంచివేయాలనే ఉద్దేశంతో ఉన్నట్లు ఆమె అవలంబిస్తున్న విధానాలను బట్టి అర్థమవుతోంది. నిరసనకారులపైకి పోలీసులను, పారా మిలిటరీ బలగాలను ఉసిగొల్పి, పరిస్థితి మరింత జటిలం కావడానికి ఆమె ఆజ్యం పోస్తున్నారు. దేశ రాజధాని ఢాకాలో కర్ఫ్యూ విధించడంతోపాటు విద్యాలయాలకు సెలవు ప్రకటించారు. దేశవ్యాప్తంగా అనేక చోట్ల ఇంటర్నెట్ సేవలను నిలిపివేసి, ఉద్యమంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమాన్ని నిరసిస్తూ 'స్వాతంత్ర్య సమర యోధుల పిల్లలకు కాకుండా రిజర్వేషన్లను రజాకార్ల (విముక్త పోరాటంలో పాకిస్తాన్‌కు మద్దతు పలికినవారు)కు ఇవ్వాలా?' అంటూ హసీనా చేసిన వెటకారపు వ్యాఖ్యలు కూడా ఉద్యమాన్ని ఎగదోశాయని చెప్పవచ్చు.

అధికార అవామీలీగ్ పార్టీకి చెందిన విద్యార్థి సంఘాలు రిజర్వేషన్ల కోటాను సమర్థిస్తూ, నిరసనకారులపై దాడులకు పాల్పడుతున్నాయి. ఒకవైపు పోలీసులు, మరోవైపు అధికార పార్టీకి చెందిన విద్యార్థి గ్రూపులు తమపై విరుచుకుపడుతున్నా ఉద్యమకారులు వెనక్కు తగ్గడం లేదు సరికదా హింసాత్మక విధానాలకు దిగుతున్నారు. మీడియా సంస్థలకు, పోలీస్ స్టేషన్లకూ నిప్పుపెట్టి, ప్రభుత్వానికి సవాల్ విసరుతున్నారు. ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణల్లో ఇప్పటివరకూ వందమందికి పైగానే విద్యార్థులు కన్నుమూసినట్లు అంచనా. చేజారుతున్న పరిస్థితిని గమనించిన ప్రభుత్వం ఒక మెట్టు దిగివచ్చి, విద్యార్థి సంఘ నేతలను చర్చలకు ఆహ్వానించింది. అయితే తుది నిర్ణయం సుప్రీం కోర్టు చేతుల్లోనే ఉంటుందని అనడంతో ఉద్యమ నేతలు చర్చలకు సుముఖత వ్యక్తం చేయడంలేదు. అభివృద్ధిలో అట్టడుగున ఉన్న దేశాల జాబితాలో బంగ్లాదేశ్ ఒకటి. విపరీతంగా పెరుగుతున్న జనాభాకు తగినట్లుగా ఉపాధి అవకాశాలు లేకపోవడంతో యువతలో నిరాశా నిస్పృహలు చోటు చేసుకుంటున్నాయి. రిజర్వేషన్లు తమ పాలిట శాపంగా పరిణమించాయన్న భావన యువతలో బలంగా నాటుకుపోయింది. ఉపాధిని వెతుక్కుంటూ బంగ్లా యువత అటు చైనాకు, ఇటు ఇండియాకు వలసపోతున్నారు. అయితే విద్యార్థులు యావత్తు రిజర్వేషన్ల వ్యవస్థను వ్యతిరేకించకపోవడం గమనార్హం. స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు, వారి పిల్లలకూ ఇస్తున్న రిజర్వేషన్లను మాత్రమే వ్యతిరేకిస్తున్నారు. సమరయోధుల పేరిట రూపొందిన జాబితాల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయన్నది కూడా వారి ఆరోపణల్లో ఒకటి. వారికి ఇస్తున్న 30 శాతం రిజర్వేషన్లను రద్దు చేయాలన్నది విద్యార్థుల ప్రధాన డిమాండ్. విద్యార్థుల ఉద్యమాన్ని పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం కోటా అమలును నాలుగు వారాల పాటు వాయిదా వేస్తూ ఆదేశాలు జారీ చేసినా పరిస్థితి మాత్రం అదుపులోకి రాలేదు. ఈ నేపథ్యంలో దండోపాయంతో విద్యార్థులను లొంగదీసుకోవాలనుకుంటున్న హసీనా ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతులలో పరిష్కారమార్గం కనుగొనేందుకు ప్రయత్నించడం శ్రేయస్కరం. మరింత మంది అమాయకుల ప్రాణాలు బలికాకుండా చూడవలసిన బాధ్యత బంగ్లా ప్రభుత్వంపై ఉంది.

# ఆడబిడ్డలకు రేవంత్ రెడ్డి, భట్టి క్షమాపణ చెప్పాలి

### మహిళలకు అసెంబ్లీలో ఇచ్చే గౌరవం ఇదేనా ఏ మొహం పెట్టుకొని వచ్చావని డిప్యూటీ సీఎం అనడం అన్యాయం





ఆత్మకూర్, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డికి మహిళలు అంటే గౌరవం లేదని నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడకపోతే ప్రజాక్షేత్రంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని తెలంగాణ ఆడబిడ్డల పట్ల ఏమాత్రం గౌరవం లేదని అధికారం అహంకారంతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారని ఆ వ్యాఖ్యలను సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందని ఆత్మకూర్ బి ఆర్ ఎస్ పార్టీ ఎం.రవికుమార్ యాదవ్ అన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు మాజీ మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి సూచనల మేరకు వనపర్తి జిల్లా ఆత్మకూర్ మున్సిపాలిటీ కేంద్రంలో స్థానిక గాంధీ చౌరస్తాలో గురువారం రోజు ఆత్మకూరు మండలం బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఎం.రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ మహిళలకు పెద్దపీట వేస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో సముచిత స్థానం కల్పిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు అసెంబ్లీలో ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. సీఎం వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని అసెంబ్లీ సాక్షిగా తెలంగాణ ఆడబిడ్డలకు బెసరత్తుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ సాంస్కృతిలో ఆడబిడ్డలకు ప్రత్యేక స్థానం గౌరవం ఉందని కనీసం ఈ సోయల్ లేకుండా ఆడబిడ్డలను నమ్ముకుంటే ఆగమైతావని ఆడబిడ్డలను నమ్ముకుంటే ముచ్చుతారంటూ జీవితం బస్టాండ్ పాలవుతుందంటూ ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా తన స్థాయి మరిచి చేసిన నీచమైన వ్యాఖ్యలను అందరూ ఖండించాలన్నారు. మహిళలకు బిఆర్ఎస్ సముచిత స్థానం గౌరవం కల్పించిందని మా మహిళల శాసనసభ్యులపై అకారణంగా ముఖ్యమంత్రి నోరు పారేసుకున్నారు. ఈ అవమానం కేవలం సబితకు, సున్నితకు జరిగింది కాదని తెలంగాణ ఆడబిడ్డలందరికీ జరిగిన అవమానం అన్నారు పదేళ్లు అధికారంలో ఉన్న ఏరోజైనా ఆడపిల్లలను అవమానించిన దాఖలు లేవని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలలోనే దాదాపు లైంగిక దాడి కేసులు నమోదయ్యా అంటే మహిళలకు రక్షణ ఏమాత్రం ఉందో అర్థం చేసుకోవచ్చని నిలదీశారు. ఇద్దరు మహిళ ప్రతినిధులపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని రేవంత్ రెడ్డి బట్టి విక్రమార్క క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

### బిఆర్ఎస్ నాయకు, పోలీసుల మధ్య ఉద్రిక్తత

మహిళా ఎమ్మెల్యేలపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బిఆర్ఎస్ నేతలు గాంధీ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మ దగ్ధం చేసేందుకు యత్నించారు. కాగా ఆత్మకూరు స్థానిక ఎస్సై నరేందర్ తమ సిబ్బందితో అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు బిఆర్ఎస్ నాయకులకు మధ్య తోపులను జరిగింది కొద్దిసేపు పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, పార్టీ సీనియర్ నాయకులు వీరేశలింగం, సింగిల్ విండో అధ్యక్షులు లక్ష్మీకాంత్ రెడ్డి,ఆత్మకూరు మున్సిపల్ కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, కో ఆప్షన్ రియాజ్ ఆలీ,పట్టణ అధ్యక్షులు జానకిరాము, సోంబాబు, మాజీ వార్డ్ మెంబర్ కొత్త బోయ శేఖర్, రాజ్ కిరణ్, సోషల్ మీడియా కన్వీనర్ ఏ.అనిల్ కుమార్,పుట్నాల రమేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాజీమంత్రి సబిత ఇంద్రారెడ్డికి అవమానం

### సి.ఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రీ రవికుమార్ యాదవ్ డిమాండ్



ఆత్మకూరు, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): అసెంబ్లీ సాక్షిగా మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి ని దూషించిన ముఖ్యమంత్రికి మహిళ అనే గౌరవం కూడా లేదని సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని వనపర్తి జిల్లా ఆత్మకూరు మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి రవి కుమార్ యాదవ్ గురువారం రోజు డిమాండ్ చేశారు. చర్చకు సంబంధం లేకుండా వ్యక్తిగత కక్ష్యతో అక్కలను నమ్ముకుంటే ముంచుతారని, అక్కలను నమ్ముకుంటే బతుకు బస్ స్టాండ్ అనడం అంటే మహిళలందరిని అవమానించినట్లే అని ఈ వ్యాఖ్యలు ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వారికి తగదని ఆమె దుయ్యబట్టారు. ఎన్నో పార్టీలు మారిన రేవంత్ రెడ్డి ఒక్క పార్టీ మారిన సబితమ్మను విమర్శించడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది అని అన్నారు. మహిళా కంట కన్నీరు ఒలికితే రాజ్యాలే పోయాయని తస్మాత్ జాగ్రత్త అని గాయత్రి హెచ్చరించారు. మహిళలకు ఇచ్చిన హామీలు ప్రతి మహిళకు 2500, గ్యాస్ సబ్సిడీ, యువతులకు స్కూటీలు, బాలింతలకు కె.సి. ఆర్ కిట్టు,స్వయం ఉపాధి అవకాశాలు అంటూ ఓట్లు దండుకుని ఒక్క హామీ కూడా అమలుపర్చకుండా మహిళలను అవమానపరిచింది నిజం కాద అని ప్రశ్నించారు. 10సం.రాలో మహిళలను కంటిరెప్పలా కాపాడిన ఘనత కె.సి.ఆర్ కి దక్కిందని నేడు రాష్ట్రములో మహిళకు భద్రత లేదని, అత్యాచారాలు పెరిగిపోయాయని ఒక్కరోజు రాష్ట్రంలో మూడు లైంగిక దాడులు మహిళపైజరిగాయని వనస్థలిపురంలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ పై సామూహిక అత్యాచారం నల్గొండ జిల్లా శాలిగౌరారంలో దివ్యాంగ మహిళపై లైంగికదాడిట్రావెల్స్ బస్సులో మహిళపై డ్రైవర్ లైంగిక దాడి జరుగుతుంటే చర్యలు తీసుకోకుండా ఉండడాన్ని గాయత్రి రవికుమార్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి అవమానానికి కొనసాగింపుగా డిప్యూటీ సి.ఎం భట్టి విక్రమార్క ఏ ముఖం పెట్టుకొని అసెంబ్లీకి వచ్చారని అనడాన్ని తీవ్రంగా ఖండిస్తూ వెంటనే సబితమ్మకు అసెంబ్లీలో బహిరంగంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి క్షమాపణ చెప్పాలని గాయత్రి రవి కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు.

# కుల పత్రాల జారిపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టాలి

- కేంద్ర హెూం సహాయక శాఖ మంత్రి బండి సంజయ్ కి వినతి
- రాజ్యసభ ఓబీసీ మోర్చా నేషనల్ ప్రెసిడెంట్ లక్ష్మణ్ కి వినతి పత్రం అందజేత
- రాష్ట్ర స్పోక్స్ పర్సన్ శంకర్ రోల్ల రవికుమార్ డిమాండ్





మక్తల్, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): మక్తల్ నియోజక వర్గంలో గొర్రెల కాపరులు అయినటువంటి కురువగా పిలువబడే మాదాసి, మాదారి కురువ సామాజిక వర్గం ఎస్సీ జాబితాలో ఉన్నది వీరందరూ కూడా గొర్రెల పెంపకం వృత్తి ద్వారా అడవుల్లో తిరుగుతూ అర్థసంచారం జీవనం సాగిస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా వీరికి కురుమ (బిసిబి) సర్టిఫికెట్ జారీ చేస్తూ రాజ్యాంగం కల్పించినటువంటి హక్కులను గత ప్రభుత్వాలు దూరం చేశాయి, మోడీ 3.0 ప్రభుత్వంలో మా జాతికి న్యాయం చేస్తే రాజ్యాంగం మాకు కల్పించినటువంటి హక్కులను ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇప్పించి మా భవిష్యత్తుతో మా పిల్లల భవిష్యత్తుకు న్యాయం చేయాలని రాష్ట్ర స్పోక్స్ పర్సన్ శంకర్ రోల్ల రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కేంద్ర హెూం సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ కి మరియు మెంబర్ ఆఫ్ పార్లమెంటు రాజ్యసభ ఓబీసీ మోర్చా నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ లక్ష్మణ్ కి వినతి పత్రం అందజేశారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

### సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా




ఆత్మకూర్ ఆగస్టు 01 తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మండల కేంద్రంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల ప్రణాళికలో అనేక హామీలు ఇచ్చినప్పటికీ ప్రధానంగా విషయం ప్రజల మౌలిక అవసరాలు తీర్చే విషయంలో ఆలస్యం జరుగుతోంది ప్రస్తుతం అమలు చేసిన రుణమాఫీ విషయంలో రైతుల ఖాతాలో డబ్బులు జమైనప్పటికీ బ్యాంక్ అధికారులు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడంలో బ్యాంక్ అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారు రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదర్శనలు చేస్తున్నారు. ప్రధానంగా రేషన్ కార్డులు కొత్త పింఛన్లు ఇండ్లు ఇండ్ల స్థలాలు ధరణి సమస్యల పరిష్కారం ఇంకా అమలుకు నోచుకోలేదు రేషన్ కార్డులు గత ప్రభుత్వం 10 సంవత్సరాల నుంచి ఇవ్వలేదు రేషన్ కార్డు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు గత ప్రభుత్వము డబుల్ బెడ్ రూమ్ నిర్మిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఎక్కడ నిర్మించకుండా పేదలకు ఎలాంటి గృహసతి కల్పించలేదు రాష్ట్రంలో ధరణి సమస్యతో బాధపడుతున్న కనీసం పాసుపుస్తకానికి నోచుకోక చనిపోతే బీమా కూడా వర్తించక పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ధరణి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి వ్యవసాయ కార్మికులకు 12000 రూపాయలు ఇస్తాను అన్న ఆమెని అమలు కోసం పూనుకోవాలి ఉద్యోగాల భర్తీలు చేయాలి రైతు భరోసా పథకాన్ని అమలులో భాగంగా రైతు ఖాతాలో డబ్బులు జమ చేయాలి. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక రెవెన్యూ ఇన్స్పెక్టర్కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏం.బాల స్వామి, చెన్నయ్య, శీను, రాములు, మాసన్న తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జి హరి



నేరేడుచర్ల, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): జి హరిసింగ్ మండలం పంచాయతీ అధికారిగా నేరేడుచర్ల బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఇక్కడ పని చేసిన ఇ. విజయకుమారి పంచాయతీ అధికారి నడిగూడెం మండలంకి బదిలీపై వెళ్లారు. మోతే మండలం నుండి నేరేడుచర్ల పంచాయతీ అధికారి హరి సింగ్ బాధ్యతలు స్వీకరించారు.


## ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా

### పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి



పరకాల, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): వర్గీకరణ తీర్పు త్వరగా వచ్చేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేసారు అని గురువారం పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో



గరిడేపల్లి, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): గరిడేపల్లి ఎంపీడీవోగా రత్తల సరోజ నూతనంగా భాద్యతలు స్వీకరించారు. నల్గొండ జిల్లా నేరేడుగొమ్మ నుంచి ఆమె బదిలీ అయ్యారు. ఇక్కడ ఇంచార్జిగా బాధ్యతలు స్వీకరించిన శ్యాంసుందర్ స్థానంలో ఈమె ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఆమె పేర్కొన్నారు.

## మాదిగ సోదరులు నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలపాలి

### జిల్లా మోర్చా అధ్యక్షురాలు అశ్విని రాధా



వనపర్తి నియోజకవర్గం, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): 30 ఏళ్ల మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ పోరాటానికి ప్రధాని మోదీ చొరవతో సుప్రీంకోర్టులో విజయం సాధించారనీ దేశంలో మరో జటిలమైన సమస్యను, తెలివిగా పరిష్కరించిన మోదీజీ. రాజ్యాంగ సవరణలు, కోర్టు కేసులు, వివాదాలు, వైషమ్యాలు లేకుండా మరో సుధీర్ఘ సమస్యకు పరిష్కారం లభించింది. ఈ విషయంలో మాదిగ సోదరులు మోదీకి ధన్యవాదాలు తెలిపాలనీ వనపర్తి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు, అశ్విని రాధా పత్రిక ముఖంగా అన్నారు.

# మద్యం మత్తు పదార్థాలను నిషేధించాలి

### పిఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక



నేరేడుచర్ల, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో మద్యం మత్తు పదార్థాలను నిషేధించాలని గురువారం నేరేడుచర్లలో పోలీస్ స్టేషన్ దగ్గర నుండి చౌరస్తా వరకు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ప్రజాసంఘాలైన ప్రగతిశీల మహిళా సంఘం పిడిఎస్యు, పివైఎల్, ఐఎఫ్టియు ఆధ్వర్యంలో ర్యాలీ తీసి నేరేడుచర్ల చౌరస్తాలో ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఈ ర్యాలీకి ముఖ్యఅతిథిగా వచ్చిన పిఓడబ్ల్యు రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యాపేట జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మద్యం మత్తు పదార్థాలు విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ అమ్మడం వల్ల యువత బ్రతుకులు చల్లా చదరయ్యాయి అనేక కుటుంబాలు ఆత్మహత్య లు చేసుకున్నాయి ముఖ్యంగా యువకులు 15 సంవత్సరాల నుంచి 45 ఏళ్ల వారు మద్యం మత్తు పదార్థాలు సేవించడం వల్ల ఆక్సిడెంట్లై చనిపోయారు అతి చిన్న వయసులో గుండె జబ్బుతో చనిపోయారు, కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే డ్రగ్స్ మత్తు పదార్థాలు నిషేధిస్తామని అదేవిధంగా బెల్ట్ షాపులు ఎత్తివేస్తామని రేవంత్ రెడ్డి అనేకసార్లు అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా రాష్ట్రంలో బెల్ట్ షాపులు యధావిధిగా కొనసాగుతున్నాయి మద్యం ఏరులై పారుతుంది అదేవిధంగా గంజాయి ఇతర డ్రగ్స్ రాష్ట్రంలో విలయతాండం చేస్తున్నాయి ప్రతిరోజు ఎక్కడో ఒక దగ్గర గంజాయి పట్టుకున్న కేసులు కనిపిస్తానే ఉన్నాయి. అదేవిధంగా పబ్బుల్లో డ్రగ్స్ తో పట్టుబడు తున్న యువత రోజురోజుకు ఎక్కువవుతుంది యువత జీవితాలని నాశనం చేస్తున్న డ్రగ్స్ అరికట్టి మత్తు పదార్థాలను నిషేధించి డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తున్న వారి పైన చట్టరీత్యా కఠినమైన శిక్షలు వేసి యువత భవిష్యత్తును కాపాడాలని కోరారు అదే విధంగా గ్రామాల్లో బెల్ట్ షాపులను పట్టణాల్లో రోడ్లమీద ఉన్న వైన్ షాపులను బార్ షాపులను తీసివేయాలని కోరారు లేనియెడల మా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్, పి ఓ డబ్ల్యు హుజూర్నగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మి పావని, శ్యామల సత్యమ్మ మరియమ్మ పిఓఎల్ నాయకులు రజాక్, పి డి ఎస్ యు నాయకుల వినయ్ షాకీర్ గోపి రంగయ్య మాలాంబి చెన్నమ్మ విజయలక్ష్మి అరుణ బాయ్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులను నియంత్రణకు పటిష్టంగా నిర్వహణ చేయాలి

### విష జ్వరాలు, డెంగ్యూ నియంత్రణకు జాగ్రత్తలు పాటించాలి
### ప్రతి మంగళ, శుక్ర వారాల్లో డ్రై డే నిర్వహించాలి
### ప్రతి ఇంటికి సురక్షిత త్రాగు నీటి సరఫరా పై చర్యలు
### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



మంగపేట, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): సీజనల్ వ్యాధులను నియంత్రణకు పటిష్టంగా పారిశుధ్య నిర్వహణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు గురువారం ములుగు జిల్లా మంగపేట రైతు వేదికలో లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జితో కలసి మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని, రెగ్యులర్ గా ఫాగ్గింగ్ చేయాలని తెలిపారు. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారని అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. ప్రజలు త్రాగునీటిని వేడి చేసి చల్లార్చి త్రాగాలని కలెక్టర్ కోరారు.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వైద్యశాఖ ఆధ్వర్యంలో అవసరమైన చోట మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి, ఫీవర్ సర్వే నిర్వహించడం జరుగుతుందని అన్నారు.

పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన పనులు చేపట్టాలని, విధులలో ఎక్కడ డార్క్ స్పాట్ ఉండకుండా అవసరమైన లైటింగ్ ఏర్పాటు చేయాలని, గ్రామాలలో ప్రతి ఇంటికి సురక్షిత త్రాగు నీటిని సరఫరా చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి రోజూ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించాలని, వర్షాకాలం నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలని ప్రతిరోజు గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి తడి చెత్త పొడి చెత్త సేకరించి సెగ్రిగేషన్ షెడ్డు కు తరలించి కంపోస్ట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి సబ్ సెంటర్ పరిధిలో ఆశా కార్యకర్తల ద్వారా గర్భిణీ స్త్రీలను గుర్తించి 100శాతం ఏఎన్సీ రిజిస్ట్రేషన్ చేయాలని, గర్భిణీ స్త్రీలకు అవసరమైన టీకాలు సకాలంలో అందించాలని అన్నారు. గర్భిణి మహిళల్లో పౌష్టికాహార లోపంతో బాధపడకుండా చూడాలని, బిడ్డ ఎదుగుదలను రెగ్యులర్ చెకప్ ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని అన్నారు. అంతకముందు తహసిల్దార్ కార్యాలయంలో కమలాపూర్ లో బిల్ట్ ఫ్యాక్టరీ పరిశ్రమ ఏర్పాటుకై కమలాపూర్ గ్రామస్తులు, ప్రజాప్రతినిదులతో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి తో కలసి మాట్లాడారు. అనంతరం గురువారం కమలాపూర్ బిల్ట్ ఫ్యాక్టరీ పరిశ్రమ, గోదావరీ ఇంటెక్ వెల్ ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి తో కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎస్సీ కార్పొరేషన్ ఈ డి తుల రవి, డి ఎం అండ్ హెచ్ ఓ అప్పయ్య, తహసిల్దార్ వీరాస్వామి, ఎం పి డి ఓ శ్రీకాంత్, మండల అధికారులు, కార్యదర్శులు, బిల్ట్ ఫ్యాక్టరీ ప్రతినిధి ప్రసాద్ నాయర్, సర్వేయర్లు, ఆశా వర్కర్లు, ఏ ఎన్ ఎం లు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఉప వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

### సిపిఐ నాయుడు వ్యాఖ్య



పాలకవీడు, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు తెలిపారు. గురువారం ఆయన పాలకవీడు లోని సిపిఐ కార్యాలయం రైతు భవన్ నుంచి విడుదల చేసిన పత్రిక ప్రకటనలో 30 సంవత్సరాల క్రితం ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కొరకు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హైదరాబాద్ ట్యాంక్ బాండ్ మీద ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే, మందకృష్ణ మాదిగ దీక్షకు మద్దతు ఇచ్చిన మొట్టమొదటి రాజకీయ పార్టీ సిపిఐ అని, ఆనాటి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, పార్టీ కార్యదర్శి హోదాలో మాదిగల ఉద్యమానికి మద్దతునిచ్చారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణను వెంటనే అమలు చేయాలని అవసరమైతే ఇప్పటికే ఇచ్చిన ఉద్యోగం నోటిఫికేషన్లలో వర్గీకరణ అమలు చేసేలా ఆర్డినెన్స్ తేవాలని మాదిగలకు, 59మాదిగ ఉపకులాల వారికి న్యాయం చేయాలని ధనుంజయనాయుడు తన ప్రకటనలో తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సంక్షోభంలోను ఆగని సంక్షేమ పథకాలు

### ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే బాధ్యత మాపై ఉంది
### ప్రజా నిర్ణయాన్ని ఇంకా జీర్ణించుకోలేకపోతున్న ప్రతిపక్షం
### పార్టీలకతీతంగా సీఎం సహాయ నిధి నిధుల మంజూరు
### చెక్కుల పంపిణి కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని



హన్మకొండ, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): ఆర్థిక సంక్షోభంలోనూ ప్రజా అభివృద్ధి మరియు సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు వెనక్కి వెళ్ళదని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ మరియు కాజీపేట మండలాలకు సంబంధించిన 62మంది లబ్ధిదారులకు రూపాయలు 6207192 రూ. ల కళ్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ చెక్కులను అదేవిధంగా నియోజకవర్గానికి సంబంధించిన 52 మంది లబ్ధిదారులకు 22 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 52 మంది లబ్ధిదారులకు రూ. 2232000 రూ. ల సీఎం సహాయానిది చెక్కులు, ఖాజిపేట మండలానికి చెందిన 42మంది లబ్ధిదారులకు రూ. 424872 రూ. ల కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు, వరంగల్ మండలానికి చెందిన లబ్దిదారులకు రూ. 2202552 ల కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులని లబ్దిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షోభ పరిస్థితులలో కూడా సంక్షేమ పథకాలు అమలులో ఏ విధమైన జాప్యం లేకుండా ముందుకు సాగుతున్నామని అన్నారు. నిర్మాణాత్మకమైన పాత్ర పోషించాల్సిన ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదని పథకాలు అమలు జరగవని శాపనార్థాలు పెడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సారథ్యంలో సంక్షేమ పథకాలను ఎట్టి పరిస్థితిలో ఆపకుండా విధివిధానాలు రూపొందించారని అన్నారు. కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ద్వారా చెక్కులు తీసుకుంటున్న మహిళా సోదరీమణులు నిర్ణీతకాలంలలో బ్యాంకులలో వేసుకోవాలని తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని ప్రజలందరకి నేనేప్పుడు అందుబాటులో ఉంటానని నేను అందుబాటులో లేని క్రమంలో వైద్యపరమైన సహాయక చర్యలు చేయాలన్న 24 గంటలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మా సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని తెలియజేశారు. వైద్య నిమిత్తం ప్రైవేట్ దావకానల్లో చికిత్స తీసుకున్న, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరికి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత అందించేలా అనుక్షణం శ్రమిస్తానని ఎమ్మెల్యే వారికి చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు పార్టీ నాయకులు అధికారులు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# విద్యార్థిని మృతిపై న్యాయ విచారణ జరిపించాలి

### విద్యార్థి, యువజన మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా




హన్మకొండ, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): హన్మకొండ జిల్లా నక్కల గుట్టలోని ప్రవేటు జూనియర్ కాలేజీలో మృతి చెందిన విద్యార్థిని మృతిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ విద్యార్థి, యువజన మహిళ సంఘాల ఆధ్వర్యంలో నక్కలగుట్టలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి డి. తిరుపతి మాట్లాడారు. ప్రతి ఏటా ప్రైవేట్ కాలేజీల్లో విద్యార్థుల మరణాల శాతం పెరిగిపోతుందని, విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుని మరణిస్తుంటే ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదని, గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం అలా వ్యవహరించకూడదని, ప్రభుత్వ ప్రైవేటు, కాలేజీల్లో విద్యార్థులు తల్లిదండ్రులతో సదస్సు అవగాహన సదస్సులు నిర్వహించి వారిలో మానసిక స్థాయిని పెంపొందించాలని, కార్పొరేటు విద్యాసంస్థలలో విద్యార్థుల ఆత్మహత్యలకు అంతూ లేకుండా పోతుందని, ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో వసతులు సౌకర్యాల మీద దృష్టి సారించాలని, నిబంధనకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు జూనియర్ కాయలపై చర్యలు తీసుకోవాలని , మరణించిన విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో విద్యార్థి మహిళ యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మహిళలకు రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపన చెప్పాలి

### మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్



హన్మకొండ, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): అసెంబ్లీ వేదికగా అధికార పార్టీ మహిళా ప్రజాప్రతినిధులపై చేసిన అనుచిత వ్యాఖ్యలు, వ్యవహరించిన తీరుకు నిరసనగా గురవారం నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం, రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి, సీనియర్ శాసనసభా సభ్యురాలు శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి పట్ల, ఇతర మహిళలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. ముఖ్యమంత్రి, మంత్రులు మహిళలకు బహిరంగంగా క్షమాపణ తెలపాలి, శాసన సభా వేదికగా ప్రతిపక్షనేతలపై అధికార పక్షం హద్దుమీరి వ్యవహరిస్తోంది, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుందగా వ్యవహరించకుండా స్థాయిని మరిచి దిగజారుడు మాటలు మాట్లాడుతున్నా రన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చాతకాక కాంగ్రెస్ ఇలా ప్రజల తరపున ప్రశ్నించే బీఆర్ఎస్ నాయకులపై వ్యక్తిగత దాడులకు, కక్షపూరిత చర్యలకు, మాటలకు దిగుతోంది, ప్రజల తరపున 6 గ్యారంటీలు, 13 హామీ, 420 మేనిఫెస్టో హామీల అమలుకు ప్రజల తరపున కొట్లాడుతాం నిలదీస్తామన్నారు. సబితా ఇంద్రారెడ్డి పై చేసిన బస్టాండ్ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీకే వర్తిస్తాయి, మహిళా ప్రజాప్రతినిధులను అవమానపరిచేలా ఉన్న వ్యాఖ్యలను వెంటనే ఉపసహరించుకోవాలి, బహిరంగంగా క్షమాపణ తెలపాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్, కార్పొరేటర్లు నల్లా స్వరూపారాణి, సంకు నర్సింగ్, ఇమ్మడి రాజు లోహిత, సోదా కిరణ్, బోయినపల్లి రంజిత్ రావు, చెన్నం మధు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్లు ఉడతల సారంగపాణి, జోరిక రమేష్, సీనియర్ నాయకులు చాగంటి రమేష్, నయీమొద్దీన్, షఫీ, సదాంత్, గబ్బెట శ్రీనివాస్, బండి రజినీకాంత్, కేశబోయిన శ్రవణ్, రమేష్, అఫ్జల్, కమరున్నీసా, పరుశురాములు, ఖలీల్, మనోహర్, సరస్వతీ, జ్యోతి, విద్య, రజిత, మౌనిక, ప్రసన్న, పావని, ఇస్మాయిల్, శ్రీనివాస్, విజయ్, బుద్దె వెంకన్న, రామ్మూర్తి, రమేష్, మహమూద్, లలిత, మహేందర్, తస్లీమ్, యాకుబ్, విద్యార్థి నాయకులు శరత్, మనోజ్, శ్రీకాంత్ చారి, రాకేష్ యాదవ్, వీరస్వామి, అనిల్, స్నేహిత్, సృజన్ , కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీవర్గీకరణ పట్ల సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

### అంబేద్కర్ యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల ఉపేందర్



పాలకవీడు, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, ఈ తీర్పుతో షెడ్యూల్ కులంలోని 59 ఉప కులాలకు న్యాయం జరుగుతుందని మాజీ ఎంపీటీసీల ఫోరమ్ మండల అధ్యక్షులు, అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు మీసాల ఉపేందర్ ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం ఆయన పాలకవీడు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ 30 సంవత్సరాల నుండి ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కొరకు మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక రకాల పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించిన కల నేటి తీర్పుతో సాకారమైందని అన్నారు. తీర్పు వెలువడిన వెంటనే తెలంగాణలో వర్గీకరణను వెంటనే అమలు చేస్తామని ఎస్సీ/ ఎస్టీ ఉపవర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించి, సంచలన తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు తెలిపి అవసరమైతే ఇప్పటికే ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లలో వర్గీకరణను అమలు చేసేలా ఆర్డినెన్స్ తెచ్చి మాదిగ, ఉపకులాలకు న్యాయం చేస్తాం అని అసెంబ్లీలో వెల్లడించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మంత్రులకు మాదిగ ఉప కులాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. 30 సంవత్సరాలుగా మాదిగ రిజర్వేషన్ కోసం పోరాటంలో అమరులైన మాదిగ అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ, గ్రామ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు పోరాటం చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులకు, పోరాటానికి మద్దతు పలికిన రాజకీయ పార్టీలకు, ప్రజాసంఘాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# బిడ్డకు తల్లిపాలను మించిన దివ్య ఔషదం మరొకటి లేదు

### పోకల వెంకమ్మ అంగన్వాడీ టీచర్



గరిడేపల్లి, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): తల్లి పాలను మించిన దివ్య ఔషదం మరొకటి లేదని, ప్రతి తల్లి తన బిడ్డకు తల్లి పాలను త్రాగించాలని అంగన్వాడీ టీచర్ పోకల వెంకమ్మ తల్లులను కోరారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా మండలం లోని గానుగబండ గ్రామంలో తల్లి పాల వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తల్లి పాల విశిష్టతను తెలుపుచూ గ్రామం లో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కేవలం ఆరు నెలల వరకే కాకుండా, బిడ్డకు రెండు సంవత్సరాలవయస్సు వచ్చే వరకు తల్లి పాలను ఇవ్వాలని, బిడ్డకు పాలు ఇవ్వటం లో తల్లి బిడ్డల మమకారం పెరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ పోలె కాంతమ్మ, పంగ శివమ్మ, ఆయా గోవిందమ్మ, గ్రామ పెద్దలు, తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

# బెస్తవాడ 1వ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

ములుగు, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఆధ్వర్యంలో ములుగు జిల్లాలో ఆగష్టు 1 నుండి 7 వరకు తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ములుగు జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లెనిన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమృతం కన్నా విలువైనది అమ్మ పాలు, చంటి బిడ్డ కు ఆరోగ్యం తో పాటు పోషణను అందించి ఆరోగ్య సమజాన్ని నిర్మించే ఉదేశ్యం తో ఈ సంవత్సరం "అంతరాలను తొలగించి తల్లి పాల ప్రాముఖ్యతను చాటుదాం" అనే నినాదంతో తల్లి పాల వారోత్సవాలను నిర్వహించుకుంటున్నాము. కాగా జిల్లాలో అన్ని స్థాయిలో ముర్రుపాల ప్రాముఖ్యత, బిడ్డ పుట్టినప్పటి నుండి 6 నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే అందిచడం మరియు 6 నెలల నుండి 2 సంవత్సరాల వరకు బిడ్డ కు అందించే అదనపు ఆహారం పై అవగహనా కల్పించడం పైన పలు కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలియజేసారు. ఈ సందర్భంగా ఐ. సి. డి .యస్ కార్యాలయం ఏటూరునాగారం పరిధిలో గల బెస్తవాడ-1 వ అంగన్వాడీ కేంద్రం లో లబ్ది దారులతో ఏర్పాటు చేసిన తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం లో పాల్గొన్నారు, ఆగష్టు 1 నుండి 7 వరకు ప్రతి అంగన్వాడీ కేంద్రం లో తల్లి పాల వారోత్సవాలు తప్పకుండ జరిపించాలని కోరియున్నారు. తల్లి పాలివ్వడం వాళ్ళ తల్లి కి కలిగే ప్రయోజనాలు అనగా, ప్రసవం తరువాత రక్త స్రావం ఆగుతుందని ప్రసవం తరువాత రక్త హీనత నుండి కాపాడుతుందని మరియు రొమ్ము కాన్సర్ ప్రమాదం నుండి కాపాడుతుందని వివరించారు.





### న్యూట్రిషనల్ డ్రింక్ - రాగి జావా స్పెషల్ డ్రైవ్"

అంగన్వాడీ కేంద్రాలకు రాగి జావా పొడి మరియు బెల్లం పొడి సప్లై, సంచాలకులు, మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆదేశాలతో ఏటూరునాగారం ప్రాజెక్ట్ లోని 206 అంగన్వాడీ కేంద్రాలకు ప్రత్యేకంగా 1 కేజీ రాగి జావా పౌడర్ మరియు 1 కేజీ బెల్లం పొడి తెలంగాణ ఫుడ్స్ వారి సహకారంతో శ్రీ. సత్య సాయి అన్నపూర్ణ ట్రస్ట్, కర్ణాటక వారు తెలంగాణలోని 3000 అంగన్వాడీ కేంద్రాలకు శాంపిల్ డ్రైవ్ క్రింద అంగన్వాడీ కేంద్రాలకు సప్లై చేశారు. ఈ సందర్భంగా బెస్తవాడ 1 వ అంగన్వాడీ కేంద్రం లో మరియు నేతాజీ నగర్ అంగన్వాడీ కేంద్రం లో ఏర్పాటు చేసిన "న్యూట్రిషనల్ డ్రింక్- రాగి జావా స్పెషల్ డ్రైవ్" లో పాల్గొని అంగన్వాడీ టీచర్లకు ఇట్టి విషయమై పలు సూచనలు జారీ చేశారు. 5 గ్రామాల రాగి జావా పౌడర్ మరియు 5 గ్రామాల బెల్లం పొడి తో తయారు చేసిన మిశ్రమాన్ని అంగన్వాడీ కేంద్రం లోని 3 నుండి 6 సంవత్సరాల హాజరు పిల్లలకు రోజు ఉదయంపిల్లలకు క్రమం తప్పకుండ త్రాగిపిస్తే పిల్లలు రోజు అంగన్వాడీ కేంద్రాలకు రావడానికి ఉత్సహం చూపుతారాని మరియు పిల్లల్లో శారీరక మానసిక ఎదుగుదలలో మంచి మార్పులు వస్తాయని అంతేకాకుండా బాలికల లో రక్త హీనత తగ్గించే విధముగా ఈ మిశ్రమం ఉపయోగ పడుతాయని జిల్లా సంక్షేమ అధికారిణి, శ్రీమతి స్వర్ణ లతా లెనిన తెలియజేసారు. ఈ కార్యకరంలో ఆకులవారి ఘనపూర్ సెక్టార్ సూపర్ వైజర్ అఫ్రిన్ మరియు లోకల్ సెక్టార్ అంగన్వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు మరియు పలువురు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి

### ప్రతిపక్షంలో ఉన్న సరే ప్రజలకు అందుబాటులో ఉందాం

### మాజీ వ్యవసాయక శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి నియోజకవర్గం, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గురువారం పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి నివాసంలో, వెలుటూర్, బలీదుపల్లి గ్రామల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో మాజీ మంత్రి మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నా సరే ప్రజలకు అందుబాటులో ఉండాలి కార్యకర్తలను కాపాడుకోవాలి. భవిష్యత్తులో పార్టీ నిర్మాణం మీద దృష్టి పెట్టాలి.



రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలనీ ప్రజల మధ్యలో ఉండే సమస్యల మీద అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు సూచించారు.

# లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన మాజీ ఎంపీపీ

### జిల్లా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామకృష్ణ రెడ్డి

వనపర్తి నియోజకవర్గం, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): పెద్దమందడి మండలం మోజర్ల గ్రామానికి చెందిన దాసరి ఆంజనేయులు తండ్రి గోపన్న హెర్నియ సర్జరీ కి సంబంధించిన సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేయడం జరిగింది. గత వారం రోజుల క్రిందట పెద్దమందడి మండల గ్రామాల వారికి సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కులనను అర్హులైన వారికి ఎమ్మెల్యే మెగా రెడ్డి చేతుల మీదుగా అందించగా, అట్టి కార్యక్రమానికి వివిధ సమస్యల వల్ల అర్హులైన లబ్ధిదారులు, కొంత మంది రాకపోవడంతో కాంగ్రెస్ నాయకులు చెక్కులకు వారి గ్రామాలకు వెళ్లి, వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మోజర్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రఘుప్రసాద్, వనపర్తి



మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామకృష్ణ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి రైతుకు రుణ మాఫీ ఋణం అందించాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్

### రుణమాఫీ ప్రక్రియలో బ్యాంకర్ల కీలక పాత్ర

గోవిందరావు పేట, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చి రైతుల మేలు కోసం ప్రత్యేకంగా రుణమాఫీ పథకం తెచ్చిందని, అర్హులైన ప్రతి రైతుకు రుణ మాఫీ ఋణం అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. గురువారం ములుగు జిల్లా గోవిందరావు పేట మండలం పస్ర నాగారం, కెనరా బ్యాంకును జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆకస్మిక తనిఖీ చేసి, రైతు రుణ మాఫీలోన్ల రీనివల్ జరుగుతున్న ప్రక్రియ పై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లు రుణమాఫీ ప్రక్రియలో కీలకపాత్ర పోషించాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణ మాఫీని రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలని, రెన్యువల్ చేయాలని సూచించారు. రైతులకు సకాలంలో రుణం అందిస్తే విత్తనాలు, పెట్టుబడికి ఉపయోగం అవుతుందని, రైతులకు రుణం భారంగా మారినందున రుణ మాఫీ చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ అక్కడ ఉన్న రైతులతో మాట్లాడారు. 12 డిసెంబర్ 2018 నుంచి 9 డిసెంబర్ 2023 వరకు క్రాప్ లోన్ తీసుకున్న రైతులకు లక్షన్నర వరకు రుణాలు ఉన్న రైతులకు రెండవ విడత కింద ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ నిధులు చేరి, రెన్యువల్స్ మాఫీ కావడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్, ఎంఏఓ జితేందర్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.





# ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్ధతను చాటుకున్నది

### ఇందిరమ్మ కాలం నుంచి దళితులపై ప్రత్యేక దృష్టి సారించిందే కాంగ్రెస్

### ఎమ్మెల్యే మేఘా రెడ్డి

వనపర్తి నియోజకవర్గం, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): ఇందిరమ్మ కాలం నుంచి దళిత అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ పాటుబడి ఉ ందని, నాటి గరీబీ హటావో నినాదం నుంచి నేటి వర్గీకరణ వరకు కాంగ్రెస్ పార్టీ దళితులపై ప్రత్యేక దృష్టి సారించి వారి అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు.ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పూర్తిస్థాయిలో స్వాగతించి నేటి నుంచే వర్గీకరణ ను పరిగణలోకి తీసుకొని రానున్న రోజుల్లో నిర్వహించే ప్రభుత్వ పరమైన అంశాలన్నింటిలో ఏబీసీడీ వర్గీకరణ ప్రకారం నిర్ణయాలు తీసుకుంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వర్గీకరణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన శ్రమ ఎంతగానో ఉందని ఆ శ్రమ ఫలితమే నేడు ఏబిసిడి వర్గీకరణకు సుప్రీంకోర్టు ఆమోదముద్ర వేసిందని ఆయన పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కనుగొనంగానే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగ మాల ఉప కులాలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు తగిన చర్యలు చేపడుతుందని ఆయన వివరించారు. ఎస్సీ వర్గీకరణ పై ప్రత్యేక ఆర్డినేషన్ ను సైతం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం యోచనలో ఉందని ఆయన పేర్కొన్నారు.



# ఘనంగా మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

గరిడేపల్లి, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగకు మద్దతుగా గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామంలో మాదిగ దండోరా ఉద్యమం 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం ఫలితం ఈ రోజు సుప్రీంకోర్టు తీర్పు ద్వారా గురువారం రోజున ఎంతో గొప్ప శుభదినం ఎందుకనగా మన మాదిగల ముద్దుబిడ్డ మంద.కృష్ణ మాదిగ నేతృ త్వంలో 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాట ఫలితంగా గురువారం దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు 6:1 ధర్మాసనం తీర్పు మాదిగలకు అనుకూలంగా తీర్పు చెప్పింది ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఎన్నో అడ్డంకులు ఎదుర్కొంటూ తన పోరాటం ఉద్యమాన్ని వెనకడుగు వేయకుండా తన పోరాటాన్ని కొనసాగించాడు. ఇట్టి పోరాట ఫలితంగా ఈరోజు సుప్రీంకోర్టు మాదిగలకు అనుకూలంగా తీర్పు ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని పొనుగోడు అంబేద్కర్ కమిటీ



ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ ఫోటోకి పాలాభిషేకం మరియు కేకు కట్ చేసి బాణాసంచాలు కాల్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఎమ్మార్పీఎస్ అమరవీరులకి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో నందిపాటి నరేష్, లంకపల్లి రమేష్, అనిల్ ,కిరణ్, మధు, మహేష్, శివ, వాసు, కిరణ్, సామ్రాట్, పిచ్చయ్య, ప్రేమ్ కుమార్, కార్తీక్, మనోజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకుల రుణాలతో ఆర్థిక అభివృద్ధి సాధించాలి

### ఆర్‌బిఐ ఎల్‌డీవో పల్లవి, డీఆర్‌డీవో ఉమాదేవి ఏపీజీవీబీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

వనపర్తి నియోజకవర్గం, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): బ్యాంకులు అందించే వివిధ రకాల సేవలను, రుణాలను సద్వినియోగం చేసుకుని ఖాతాదారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆర్‌బిఐ ఎల్‌డీవో పల్లవి, డీఆర్‌డీవో ఉమాదేవి సూచించారు. గురువారం ఏపీజీవీబీ బ్యాంకు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు కార్యక్రమానికి ఆర్‌బీఐ ఎల్‌డీవో పల్లవి, ఎల్‌డీఎం కౌశల్ కిషోర్ పాండే, డీఆర్‌డీవో ఉమాదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ బ్యాంకులలో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి అధిక రుణాలను పొందాలని మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ సేవల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, సైబర్ సెక్యూరిటీ గురించి వారు ఖాతాదారులకు వివరించారు. ప్రతి ఖాతాదారుడికి కూడా తప్పనిసరిగా నామిని ఉండేలా చూసుకోవాలని సూచించారు. రుణాలను సకాలంలో చెల్లించడంతో పాటు బ్యాంకుల్లో పొదుపులు చేసుకోవాలని సూచించారు. ఎఫ్ఎల్‌సి కౌన్సిలర్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సామాజిక భద్రత పథకాలైనా పీఎంజెజెబీవై, పీఎంఎస్‌బీవై ఇన్సూరెన్స్ చేసుకోవాలని సూచించారు.





అర్హులైన ప్రతి ఒక్కరు ఏపీవైలో భాగస్వాములు కావాలని కోరారు. మోసపూరిత కాల్స్ నమ్మకూడదని ఓటీపీలు ఎవరికి కూడా చెప్పకూడదని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం భాషా నాయక్, ఏపీఎం నాగమణి, ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ జ్ఞానేష్ గౌడ్, ఫీల్డ్ ఆఫీసర్స్ అరుణ్ క్రాంతి, దక్షేశ్వర్ రెడ్డి, ఎల్‌డీఎం ఆఫీస్ సిబ్బంది సాయికుమార్, ఖాతాదారులు, గ్రామ పెద్దలు ,బ్యాంకు మిత్రలు పాల్గొన్నారు.

# అర్హుల అందరికీ త్వరలోనే రేషన్ కార్డులు

### రేషన్ కార్డుల జారీకి క్యాబినెట్ ఆమోదం

### ఎమ్మెల్యే మేఘారెడ్డి వాఖ్యలు



వనపర్తి నియోజకవర్గం, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): గత పది ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డు లేక నిరుపేదలు ఎంతగానో ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నేడు అర్హులందరికీ రేషన్ కార్డుల పంపిణీకి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో రేషన్ కార్డుల పంపిణీకి వెంటనే చర్యలు చేపట్టేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని ఆయన తెలిపారు. నిరుపేద కుటుంబాల్లో అతి కీలకంగా ఉపయోగపడే రేషన్ కార్డు లు లేక చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి త్వరలోనే రేషన్ కార్డులు అందుతాయని ఆయన సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలువరుస్తుందని ఎవరు ఎక్కడ కూడా నిరుత్సాహానికి గురి కాకూడదని అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వ పథకాల ఫలాలు అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని ఆయన వివరించారు. అన్నదాతల నడ్డి విరిచేందుకు గత పాలకులు ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు భూమాతగా మారుస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని ఆయన వివరించారు. ఇకపై అన్నదాతల భూ సమస్యల పరిష్కారానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరిష్కరించుకోవచ్చునని ఆయన సూచించారు.

# గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి

### గ్రామస్తులు స్వచ్ఛందంగా 1,06,000 చందా విరాళం

ఆత్మకూర్, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం ఆరేపల్లి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆత్మకూరు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గత నాలుగు రోజుల క్రితం గ్రామ ప్రజలకు సీసీ కెమెరాలు యొక్క ప్రాముఖ్యతను అవగాహన కల్పించారు ఇట్టి సందర్భంగా గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామస్తుల ఆధ్వర్యంలో 1,06,000 చందాలు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా పల్లి గ్రామస్తుల సహకారంతో తమ వంతు సహాయంగా కృషి చేస్తామని ఆత్మకూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివకుమార్ 5000 రూపాయలు స్థానిక ఎస్సై నరేందర్ రూపాయలు తమ వంతు సహాయంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహాయ సహకారాలు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై నరేందర్ ని గ్రామస్తులు శాలువాతో సన్మానించి పూలమాలతో సత్కరించారు ఇట్టి కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# అంతులేని కథ...

కరీంనగర్: కాళేశ్వరం ప్రాజెక్ట్ పై మాటల మంటలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎలాగైనా ఆ ప్రాజెక్ట్ తో తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని చెప్పుకోవాలన్న ఆరాటంలో బీఆర్ఎస్ ఉంది. అందుకే కేటీఆర్ సహా గులాబీ నేతల బృందం కాళేశ్వరం వెళ్లి పరిశీలించి వచ్చారు. అక్కడితో మ్యాటర్ ఆపకుండా కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రాజెక్టును దెబ్బతీశారని తనకు ఎప్పటినుంచో అనుమానం ఉందని కేటీఆర్ చెప్పడం ఇప్పుడు అసలు ట్విస్ట్.కాళేశ్వరంపై ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చాలా డైలాగ్ వార్ నడిచింది. కాళేశ్వరం తెలంగాణ వరప్రదాయిని అని బీఆర్ఎస్.. అప్పుల కుప్ప ఒక్క ఎకరాకూ నీళ్లు దక్కే పరిస్థితి లేదని కాంగ్రెస్ ఇలాంటివెన్నో మాటల యుద్ధాలు నడిచాయి. అసలు ప్రాజెక్టు తుమ్మడిహెట్టి దగ్గర కాకుండా కట్టడం, డిజైన్లు మార్చడం, నాసిరకం నిర్మాణాలంటూ కాంగ్రెస్ ఎదురుదాడులు చేసింది. అటు మేడిగడ్డ కుంగడంతో బీఆర్ఎస్ కూడా డిఫెండ్ చేసుకునేలా అన్ని ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. తాజాగా ఇదే కాళేశ్వరంపై తెరపైకి వచ్చిన కొత్త విషయం ఏంటంటే.. గులాబీ నేతలు మొన్నామధ్య కాళేశ్వరం పర్యటనకు వెళ్లివచ్చారు.మాజీ మంత్రి కేటీఆర్ చేసిన కామెంట్స్ తో ఇప్పుడు మరోసారి ఈ ప్రాజెక్టు గురించి చర్చ మొదలైంది. అసలు కేటీఆర్ ఏమన్నారంటే.. మేడిగడ్డ 28 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకుని నిలబడిందని అలాంటిది? ఏ వరదా లేనప్పుడు ప్రాజెక్టు ఎలా కుంగిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రాజెక్టును దెబ్బతీశారని తనకు ఎప్పటినుంచో అనుమానం ఉందంటూ మాట్లాడారు. రేపు ప్రాజెక్టుకు ఏదైనా జరగకూడనిది జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత అని, కాళేశ్వరాన్ని ఏదైనా చేస్తారనే డౌట్ కూడా ఉందన్నారు కేటీఆర్కాబట్టి కాళేశ్వరంపై కొత్త కథలను కేటీఆర్ ఎత్తుకున్నారు. ఇప్పటికే మేడిగడ్డ కుంగడం, అన్నారం, సుందిళ్లలో బుంగలు పడడం, ఎక్కువ నీటిని నిల్వ చేస్తే అసలుకే ప్రమాదం అని ఇప్పటికే ఔిఆూం స్పష్టం చేసింది. దీంతో వరద వచ్చింది వచ్చినట్లు కిందికి వదిలేస్తున్నారు. అలాంటిది లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకున్న మేడిగడ్డ బరాజ్.. ఏ వరదా లేనప్పుడు ఎలా కుంగిందో అర్థం కావడం లేదంటూ కొత్త డౌట్లను తెరపైకి తేవడం అంతా పకడ్బందీ ప్లాన్ లో భాగమే అంటున్నారు. కాళేశ్వరం డ్యామేజ్ నుంచి సబ్జెక్ట్ డీవియేట్ చేయడమన్న వాదన వినిపిస్తోంది. గతేడాది అక్టోబర్ 21న మేడిగడ్డలోని ఏడో బ్లాక్ లోని నాలుగు పిల్లర్ల దగ్గర పెద్ద శబ్దంతో క్రాక్స్ వచ్చి పిల్లర్లు కుంగాయి.అప్పుడు బరాజ్ కుంగిపోవడానికి ముందు పేలుడు వంటి శబ్దం వచ్చిందన్న స్టోరీలు వినిపించారు. మహారాష్ట్ర వైపు నుండి 3 మీటర్ల దూరంలో 20వ పిల్లర్ వద్ద శబ్దం వచ్చిందన్నారు. మహారాష్ట్ర, తెలంగాణ మధ్య రవాణాకు సంబంధించి ఈ రెండు వ్యవస్థలు నిత్యం నిశిత పరిశీలన జరుపుతుంటాయి. అయినప్పటికీ మేడిగడ్డ కుంగుబాటును ఇంకేదో ఖాతాలో వేసుకుని తప్పించుకునే ప్రయత్నాలు అప్పుడు జరిగాయి. కానీ విద్రోహ చర్య ఏదీ లేదని అప్పట్లోనే నిపుణులు, భద్రతా సిబ్బంది తేల్చేశారు. ఔిఆూం టీమ్ ఢిల్లీ నుంచి వచ్చి పరిశీలన జరిపి, కుంగుబాటుకు కారణాలు వెల్లడించింది. మధ్యంతర నివేదిక ఇచ్చింది. రిపేర్లు పూర్తయ్యే దాకా గేట్లు ఓపెన్ చేసి పెట్టాలన్నదిలక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం కట్టారు. అసలు డిజైన్ చేసింది తానే అని ఒక సందర్భంలో కేసీఆర్ చెప్పుకున్నారు. మెదడు, రక్తం కరిగించి కట్టానన్నారు. బరాజ్ కుంగిన తర్వాత ప్రశ్న అడిగితే.. తనకు తెలియదని, అంతా ఇంజినీర్లదే అని అన్నారు. సో ఒక అబద్ధాన్ని నిజం చేయడం కోసం, అలాగే ఒక తప్పును కప్పి పుచ్చుకోవడం కోసం కొత్త వ్యూహాలకు బీఆర్ఎస్ నేతలు తెరలేపుతున్నారన్న వాదన వినిపిస్తోంది. కేసీఆర్ కుటుంబం కమీషన్ల కక్కుర్తి కోసం రాష్ట్ర నీటిపారుదలరంగాన్ని, కాళేశ్వరం ప్రాజెక్టును సర్వనాశనం చేసిందని కేసీఆర్, కేటీఆర్‌పై మంత్రి ఉత్తమ్ విరుచుకు పడ్డారు. కేటీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతూ.. ప్రజల్లో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని, తప్పుడు ప్రచారంలో గోబెల్స్‌ను కేటీఆర్ మించిపోయా రంటూ కౌంటర్ ఇచ్చారు. కాళేశ్వరం కట్టినప్పుడు.. కూలినప్పుడు అధికారంలో ఉన్నది కేసీఆర్ కుటుంబమే అన్న విషయాన్ని కేటీఆర్ కు గుర్తు చేశారు.కూలిన తర్వాత 45 రోజులు వారే అధికారంలో ఉన్నారన్నారు. రీ-డిజైనింగ్, రీ-ఇంజనీరింగ్‌తోనే మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోయిందన్నారు. సో ఇప్పుడు గోదావరిలో వరద వస్తోంది. ఆ నీటిని ఎత్తి పోయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. నిజానికి ఎక్కడికి ఎత్తిపోయాలి.. ఎక్కడ నిల్వ ఉంచాలి.. నిల్వ ఉంచితే వచ్చే ప్రమాదాలు.. ఇవన్నీ తెలియవా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇంత చేసి కాళేశ్వరం టూర్ కు వెళ్లిన గులాబీ బ్యాచ్.. మేడిగడ్డలో తప్పు జరగలేదు అన్న విషయాన్ని కూడా చెప్పలేకపోయిందంటున్నారు కేంద్రమంత్రి బండి సంజయ్. కొండను తవ్వి ఎలుకను కూడా పట్టుకోలేకపోయారని అంటున్నారుఔిఆూం రిపోర్ట్ బీజేపీ ఆఫీస్ లో తయారు చేసిందేఅని, ఎన్డీఎస్ఏకు పోలవరంపై లేని శ్రద్ధ కాళేశ్వరంపై ఎందుకని కేటీఆర్ ఇటీవలే చేసిన కామెంట్లపై బండి మండిపడ్డారు. అయితే కాళేశ్వరంలో తప్పు జరిగిందని కేటీఆర్ ఒప్పుకున్నట్టేనా అని ప్రశ్నించారు. పోలవరానికి కాళేశ్వరానికి లింక్ ఎందుకన్నారు. పోలవరంలో తప్పు జరిగితే.. ఫిర్యాదు చేయాలని సూచిం చారు. అంతేగానీ.. కాళేశ్వరం తప్పులను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ గుర్తిస్తే తట్టుకోలేక పోతున్నారంటున్నారు. కాబట్టి కాళేశ్వరం కథలకు ఇప్పట్లో ఫుల్ స్టాప్ పడేలా కనిపించడం లేదు. కౌంటర్లు, ఎన్ కౌంటర్లు, డౌట్లు, విచారణలు ఇవన్నీ మరింతకాలం కొనసాగడం ఖాయంగానే కనిపిస్తోంది.

## బీసీ హాస్టల్ లో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర శిబిరం : డాక్టరు.రేణుక



వనపర్తి నియోజకవర్గం,ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్ ): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెద్దమందడి పరిధిలోని బీసీ హాస్టల్ లో,గురువారం వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది, వైద్యాధికారి డాక్టర్ రేఖా ఆధ్వర్యంలో ఈ సీజన్లో వచ్చే వ్యాధుల గురించి, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వైద్యాధికారి విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థుల భోజనాశాలని సందర్శించి మెరుగైన ఆరోగ్యవంతమైన ఆహారం విద్యార్థులకు అందచేయాలని వార్డెన్ కు సూచించి, విద్యార్థులను పరీక్షించే మెడిసిన్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో హాస్టల్‌వార్డెన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కోదండ... రామ్... రామ్..ఏనా

హైదరాబాద్: తెలంగాణ ఉద్యమంతో ఓ వెలుగు వెలిగిన ఆచార్య కోదండరాం? రాజకీయంగా సక్సెస్ అయ్యారా? లేదా? అన్న ప్రశ్నకు ఎవరూ కచ్చితమైన ఆన్సర్ చేయలేకపోతున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో రాజకీయంగా విభేదించిన కోదండరాం? సొంతంగా పార్టీ పెట్టినా? ప్రజల నుంచి ఆశించిన మద్దతు లభించలేదు. ఐతే సొంతంగా కేసీఆర్‌పై పైచేయి సాధించలేకపోయిన ప్రొఫెసర్ కోదండరాం?. 2018లోనే కాంగ్రెస్‌తో జట్టుకట్టి కారును గ్యారేజీకి పంపాలని శ్రమించినా ఫలితం దక్కలేదు. పట్టు వదలని విక్రమార్కునిలా మరోసారి గత ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి గులాబీ కోటను కూల్చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించి? ప్రభుత్వ వ్యతిరేకఓటు చీలకుండా హస్తం పార్టీ విజయానికి దోహదపడ్డ ప్రొఫెసర్ కోదండరాంకి ఇప్పటివరకు ఎలాంటి పదవీ దక్కకపోవడంపై జన సమితి నేతల్లో తీవ్ర చర్చ సాగుతోందిఒక ఎమ్మెల్సీ, రెండు నామినేటెడ్ పోస్టుల హామీతో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న ప్రొఫెసర్ కోదండరాం పార్టీకి ఇంతవరకు ఏ ఒక్క పదవీ దక్కలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8 నెలలైనా.. కోదండరాంకి కానీ, ఆయన అనుచరులకు కాని ప్రభుత్వంలో ఎలాంటి గుర్తింపు లభించకపోవడంపై తెలంగాణ జనసమితి నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది డిసెంబర్‌లో సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన తర్వాత? ఆయన క్యాబినెట్లో కోదండరాంని తీసుకుంటారని ప్రచారం జరిగింది. కానీ, అది ఉట్టి ప్రచారంగానే మిగిలిపోయింది.ఆ తర్వాత నిరుద్యోగుల ఆలోచన ప్రకారం టీఎస్పీఎస్సీ చైర్మన్‌గా నియమిస్తారని మరో ప్రచారం జరిగింది. ఐతే టీఎస్పీఎస్సీ చైర్మన్‌గా మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డిని నియమించడంతో కోదండరాం పేరు ఊహాగానాలకే పరిమితమైంది. అదేవిధంగా జనవరిలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా కోదండరాం పేరును సిఫార్సు చేసినా కోర్టు జోక్యంతో ఆ నియామకం పెండింగ్‌లో పడిపోయింది. ఇక అప్పటి నుంచి కోదండరాం పేరు వెయిటింగ్ లిస్టులోనే పడిపోయింది.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఊరిస్తున్న పదవులన్నీ కోదండరాంకి దక్కకపోగా, ఆయనకు బాధ్యతలు ఎక్కువైపోయాయంటున్నారు. మాజీ సీఎం కేసీఆర్ సర్కార్ పతనానికి ప్రధాన కారణమైన నిరుద్యోగ సమస్య ఇప్పుడు కోదండరాం మెడకు చుట్టుకుంటోందట. ఉద్యోగ నియామకాల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు కోదండరాంనే టార్గెట్ చేస్తున్నారు. ఎన్నికల్లో ప్రొఫెసర్ కోదండరాం మాటలు వినే.. తామంతా కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచామని.. కానీ ఇప్పుడు కొన్ని విషయాల్లో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ కోదండరాం ఇంటి ముందు ఆందోళనలకు దిగుతున్నారు నిరుద్యోగులు. అటు పదవీ దక్కక ఇటు ప్రజలు, నిరుద్యోగుల నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో ప్రొఫెసర్ కోదండరాంకు పొలిటికల్ కెరీర్ అచ్చిరాలేదంటూ కామెంట్లు వినిపిస్తున్నాయి. తన మద్దతుతో ప్రభుత్వాలను ఏర్పాటు చేయించగలుగుతున్న ప్రొఫెసర్ కోదండరాం? ప్రభుత్వంలో భాగం కాలేకపోతున్నారంటున్నారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో జేఏసీ చైర్మన్‌గా కీలకంగా పనిచేసిన కోదండరాం?. రాష్ట్రం ఆవిర్భవించిన పదేళ్ల తర్వాత కూడా ప్రభుత్వ పదవి దక్కించుకోలేక పోవడం, ముఖ్యంగా తానెంతో కోరుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి హయాంలోనూ పదవి అందని ద్రాక్షగా మారడంపై రకరకాల చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తమకు నామినేటెడ్ పదవులు వస్తాయని ఆశించిన తెలంగాణ జనసమితి నేతలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నట్లు తెలుస్తోంది. తమ నేతకే ఏ దిక్కులేకపోవడంతో తమనెవరూ పట్టించుకోవడం లేదని టీజేఎస్ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు చెబుతున్నారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఇప్పటివరకు అమలు కాకపోవడం? కాంగ్రెస్ నేతలకు వరుసగా నామినేటెడ్ పదవులను కట్టబెడుతూ నిర్ణయాలు తీసుకుంటుండటం వల్ల టీజేఎస్ వర్గాలు ప్రొఫెసర్ కోదండరాంపై ఒత్తిడి తెస్తున్నట్లు చెబుతున్నారు. తనకే ఏ పదవీ లేకపోవడం? తన వారిని ఎలా సర్దుబాటు చేయాలో తెలియక ఎరక్కపోయి.. ఇరుక్కుపోయామా? అంటూ టీజేఎస్ అధినేత నిర్వేదం వ్యక్తం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో టీజేఎస్ నేత ప్రొఫెసర్ కోదండరాం ఆవేదనను కాంగ్రెస్ హైకమాండ్ అర్థం చేసుకుంటుందా? అనేది ఆసక్తికరంగా మారింది. ప్రొఫెసర్ నిరీక్షణకు ఎలాంటి ముగింపు పలుకుతుందో చూడాల్సివుంది.

## సాగునీటి కోసం బుద్ధారం చెరువును సందర్శించిన కాంగ్రెస్ నాయకులు



వనపర్తి నియోజకవర్గం, ఆగస్టు 01 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలానికి బుద్ధారం చెరువు నుండి సాగునీరు అందించేందుకు ఎమ్మెల్యే మేఘా రెడ్డి ఆదేశాముసరం బుద్ధారం బ్రాంచ్ కెనాల్ ను సందర్శించి, కెనాల్ ద్వారా పెద్దమందడి మండలానికి సంబంధించిన రైతులకు సాగునీరు అందించేందుకు కసరత్తు చేస్తున్నామని, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, మాజీ వెల్టూరు సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రామచంద్రయ్య గౌడ్,బి మాజి జెడ్పిటిసి వెంకటస్వామి, మరియు ఎస్ఎంసి చైర్మన్ టైలర్ రవి, టిఎంఆర్ నాయకులు రాఘవేందర్ మరియు మాజీ సర్పంచ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు చిన్నారుల భద్రత కోసం రూ.13,412 కోట్లు ఖర్చు

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడి

ఢిల్లీ: పార్లమెంట్ లో అడిగిన ప్రశ్నకు వివరాలు వెల్లడించిన మంత్రి సంజయ్. దేశంలోని మహిళల భద్రత కోసం వివిధ పథకాలు, కార్యక్రమాల కింద రూ.13,412 కోట్లు ఖర్చు చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. మహిళా భద్రతా పథకాల కింద మహిళలు, పిల్లలపై లైంగిక వేధింపుల కేసులను నిర్వహించే పరిశోధకులతోపాటు ప్రాసిక్యూటర్ల సామర్థ్యం పెంపొందించేందుకు శిక్షణ ఇచ్చే నిబంధన ఉందా? ఏయే కార్యక్రమాలు అమలు చేస్తున్నారంటూ ఎంపీ నీరజ్ శేఖర్ అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ బదులిచ్చారు. ప్రధానమంత్రి ఆదేశాల మేరకు హోం మంత్రి ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఆ వివరాలను సభలో వివరించారు. అవేమిటంటే. ఇంటర్ ఆపరేబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టం కోసం రూ.3375 కోట్లు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ కోసం రూ.531.24 కోట్లు, స్కీం ఫర్ మోడర్నైజేషన్ ఆఫ్ ఫోరెన్సిక్ కోసం రూ.280 కోట్లు, జైళ్ల ఆధునీకరణ కోసం రూ.950 కోట్లు, రాష్ట్ర సైన్స్ ఫోరెన్సిక్ లాబరేటరీల పటిష్టత కోసం రూ.106.75 కోట్లు, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీలు, ఫోరెన్సిక్ డేటా సెంటర్, 6 సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీల ఆధునీకరణకు రూ.354.25 కోట్లు, సేఫ్ సిటీ ప్రాజెక్ట్ కోసం రూ.2840 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు.

అట్లాగే శిక్షణ, సామర్థ్యం పెంపు కోసం రూ.76.5 కోట్లు, పేద ఖైదీల కోసం రూ.60 కోట్లు, మానవ అక్రమ రవాణా నిరోధక యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, యూనిట్ కోసం రూ.113.76 కోట్లు, మహిళా హెల్ప్ డెస్కుల కోసం రూ.164.2 కోట్లు, చండీఘడ్ లో డీఎన్ఏ ల్యాబ్ ఏర్పాటు కోసం రూ.42.84 కోట్లు, మహిళలు, చిన్నారులపై సైబర్ నేరాల నియంత్రణ కోసం రూ.224.76 కోట్లు, సెంట్రల్ విక్టిమ్ కాంపోజిషన్ ఫండ్ కోసం రూ.200 కోట్లు, ఢిల్లీ పోలీస్ స్కీం ఫర్ ప్రొవైడింగ్ ఫెసిలిటీ ఆఫ్ సోషల్ వర్కర్స్ , కౌన్సిలర్స్, న్యూ బిల్డింగ్ ఫర్ విమెన్ సెంట్రిక్ ఫెసిలిటీస్ ఫర్ స్పెషల్ నీడ్స్ ఫర్ విమెన్ అండ్ చిల్డ్రన్ కోసం రూ.38.8 కోట్లు, నేషనల్ ఫోరెన్సిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్ మెంట్ స్కీం కోసం రూ.2254 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. మొత్తంగా రూ.13,412 కోట్లు మన అమ్మలు, అక్కలు, చెల్లెళ్లు, బిడ్డల కోసం ఖర్చు పెడుతున్నట్లు వివరించారు.

## రేవ్ పార్టీ భగ్నం మద్యం స్వాధీనం

మేడ్చల్: మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుల్లితెర నటులు రేవ్ పార్టీ నిఏర్పాటు చేసుకున్నారు. బర్త్ డే పార్టీ అంటూ చెప్పుకొస్తున్న పోలీసులు, బిగ్ బాస్ షో ఫేం మహబూబ్ షేక్ తో పాటు పార్టీ ఆర్గనైజర్ పై కేసు నమోదు చేసారు. తోటి స్నేహితులు ఇరువై మంది తో కలిసి కాంటినెంట్ రిసోర్ట్ లో ఎక్సైజ్ అనుమతి లేకుండా బర్త్ డే పార్టీ నిర్వహించారు. లిక్కర్ బాటిల్స్ 10 లీటర్లు , బీర్ బాటిల్ 5 లీటర్లు స్వాధీనం చేసుకున్నారు.

## దర్బార్ హోటల్ లో కుళ్లిన ఆహార పదార్థాలు

మేడ్చల్: మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ లోని దర్బార్ బార్ అండ్ రెస్టారెంట్ లో కుళ్లిన ఆహారపదార్థాలు అమ్ముతున్నారన్న సమాచారంతో సదరు రెస్టారెంట్ లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు .నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ హైదరాబాద్ ఛైర్మన్ దత్తాత్రేయ ఫిర్యాదు మేరకు దర్బార్ రెస్టారెంట్ లో ఫుడ్ ఇనస్పెక్టర్ ధర్మేందర్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేసి కుళ్లిన , సీజ్ చేసి పరీక్షలకు పంపారు. కాగా కుళ్లిన , తేదీ మీరిన ఆహారపదా ర్థాలు అమ్మి వినియోగదారుల అనారోగ్యానికి కారణం అవుతున్న రెస్టారెంట్లు, హోటళ్ల పై కఠిన చర్యలు తీసుకోవాలని దత్తాత్రేయ అధికారులను డిమాండ్ చేశారు.

## చౌటుప్పల్ లో చోరీలు

యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న గ్రామాల్లో వరుస దొంగతనాలు చేస్తూ దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. బొర్రోలగూడెం గ్రామంలో నిన్న అర్ధరాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంట్లోకి చొరబడి తొమ్మిది లక్షల రూపాయల నగదు, 12 తులాల బంగారం, ఇరవై తులాల వెండి ఆభరణాలను చోరీ చేసారు దొంగలు. తలుపులు తెరిచి ఉండడంతో పక్కింటి వారు గమనించి ఇంటి యజమాని ములుగు ప్రభాకర్ కి సమాచారం ఇచ్చారు.అయన ఇంటికి చేరుకొని 100 కు దయల్ చేసాడు. దీంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని క్లూస్ టీం తో దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు మాట్లాడుతూ నిన్న తమ బంధువులు హైదరాబాదులో చనిపోగా దహన సంస్కారానికి వెళ్లడంతో అర్ధరాత్రి కావడంతో అక్కడే ఉండడం జరిగింది... తాము ఇంట్లో లేని సమయంలో దొంగలు పడ్డారని ఇట్టి విషయాన్ని తమకు పక్కింటి వారి సమాచారం ఇవ్వడంతో వెంటనే చేరుకొని పోలీసులకు సమాచారం ఇచ్చాము...

# ఘనంగా ప్రారంభమైన తాండూర్ ఉర్సు ఉత్సవాలు

### ఈ ఉత్సవాలకు వంద ఏండ్ల చరిత్ర

### వివిధ రాష్ట్రాల నుండి భక్తుల రాక

### కట్టుదిట్టంగా పోలీస్ భద్రత ఏర్పాట్లు

తాండూర్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే బెల్లంపల్లి నియోజకవర్గంలో గల తాండూర్ ఉరుసు ఉత్సవాలకు ఎంతో ఘన చరిత్ర ఉంది. ఈ మేరకు తాండూర్ గ్రామంలోని దర్గా వద్ద ఘనంగా ఉరుసు ఉత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ ఉరుసు ఉత్సవాలు గత 100 సంవత్సరాల నుండి కొనసాగుతున్నాయి. ఈ యొక్క ఉత్సవాల్లో కవాలి నృత్యాలు సైతం ఉండనున్నాయి. ఇందుకు గాను వివిధ రాష్ట్రాల నుండి కళాకారులను రప్పిస్తున్నారు. అవి అక్కడికి వచ్చిన భక్తులను ఎంతగానో అలరింపచేస్తూ, ఆకట్టుకుంటాయి. ముక్యంగా కవాలి నృత్యాలు తిలకించడానికి చిన్నా, పెద్దా తేడా లేకుండా హాజరవుతారు. రాత్రింబవళ్లు అక్కడ కాలక్షేపం చేయడం ప్రతీ ఏట కనబడుతుంది. ఎంతో ప్రాముఖ్యం గల ఈ ఉరుసు ఉత్సవాలను తిలకించడానికి వివిధ రాష్ట్రాల నుండి సైతం భక్తి శ్రద్ధలతో భక్తులు పెద్ద ఎత్తున తరలి రానున్నారు. కుల, మత వర్గాలకు అతీతమైనది కావడంతో ఈ ఉత్సవంకు ఎంతో ప్రాధాన్యం, ప్రాముఖ్యం సంతరించుకుంది. దీంతో సబ్బండ వర్గాలు తరలి రావడం మనకు కనిపిస్తుంది. కొంత మంది ఈ ఉత్సవాల్లో పాల్గొనడానికి ముందస్తుగానే తాండూర్ మండల కేంద్రానికి చేరుకున్నారు. వారి వారి సమీప బంధువుల ఇళ్లళ్ళకు చేరుకున్నారు. ఈ వేడుకలకు దర్గా కమిటీ ముందస్తు ఏర్పాట్లను సైతం పూర్తి చేశారు. ఈ మేరకు దర్గా చుట్టుప్రక్కల సమీప పరిసరాలను పరిశుభ్రం చేశారు. దర్గా నిర్మాణాలకు సైతం రంగులు అద్ది అలంకరింప చేశారు. ఈ ఉత్సవాలకు రానున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కాకుండా ఏర్పాట్లు చేసినట్లు దర్గా కమిటీ ఇదివరకే ప్రకటించింది. సందర్శకుల సౌకర్యార్థం చిరు వ్యాపార సముదాయాలు వెలిశాయి. ఈ సమదాయాల్లో తినుబండారాల నుండి మొదలుకొని పిల్లల ఆట వస్తువుల వరకు లభించును. ఈ రెండు రోజుల ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా దర్గా కమిటీకి పోలీసు వారు సైతం దిశా నిర్దేశం చేస్తున్నారు.

# నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

### నేటి మొక్కలే రేపటి వృక్షాలు

సిద్దిపేట: కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురా మొక్కలు నాటారు. అనురాధ మాట్లాడుతూ సమతుల్యమైన ఆహ్లాదకరమైన వాతావరణం గురించి మొక్కలు చాలా ముఖ్యం. భావితరాలను దృష్టిలో పెట్టుకొని మొక్కలు నాటాలి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించడం జరిగింది, పరిశుభ్రత, పచ్చదనము, ఆహ్లాదకరమైన వాతావరణము గురించి మొక్కలు చాలా ముఖ్యం అందులో భాగంగా కమిషనరేట్ కార్యాలయం పెరేడ్ గ్రౌండ్ లో జిల్లా పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో కలిసి 800 మొక్కలు నాటడం జరిగింది. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని అధికారులకు సిబ్బందికి సూచించారు. ఈనాటి మొక్కలే రేపటి వృక్షాలని భావితరాలకు ఆహ్లాదకరమైన పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడానికి వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటి సంరక్షించాలని అధికారులకు సిబ్బందికి సూచించారు పోలీస్ స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలు పరిశుభ్రత పచ్చతనముతో



ఆహ్లాదకరంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ యస్. మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ మధు, హుస్నాబాద్ ఎసిపి సతీష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ పూర్ణచందర్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ యాదమ్మ, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ బాబు, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్, మరియు ఇన్స్పెక్టర్లు, సిఐలు కమిషనర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్ దే

**టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు తీరని అన్యాయం జరిగింది**

**అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రసంగించిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు**



పెద్దపల్లి: దేశంలోనే రైతులకు ఏకకాలంలో 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేసిన చరిత్ర లేదని, ఆ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు గారు అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఆయన బడ్జెట్ పై ప్రసంగించారు. గత ఏడాది వరంగల్ సభలో కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ప్రకటించిన రైతు డిక్లరేషన్ లో భాగంగా 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన హామీకి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు రుణమాఫీ చేసేందుకు ఎంతగానో శ్రమించారని ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి నాలుగు విడుదల వేసిన డబ్బులు వడ్డీలకే సరిపోయాయని అన్నారు. రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రుణమాఫీ చేస్తామని చెప్పి అసెంబ్లీ ఎన్నికలు సమీపించే సమయంలో కొంతమందికే రుణమాఫీ చేశారని అనేక మంది రైతులకు రుణమాఫీ చేయలేదని దీంతో రైతులు అప్పుల పాలయ్యారని విమర్శించారు. రైతుబంధు ఒకటే సర్వరోగ నివారిణి అని భావించిన గత ప్రభుత్వం రుణమాఫీ సక్రమంగా చేయలేదని, ఇతర పథకాలను కొనసాగించలేదని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల వల్ల పంటలు నష్టపోతే రైతులను ఆదుకునేందుకు పంటల బీమా పథకాన్ని అమలు చేయలేదన్నారు. 2019 నుంచి ఈ పథకం రాష్ట్రంలో అమల్లో లేకుండా పోయిందని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది యాసంగి సీజన్లో పెద్దపల్లి జిల్లాలో కురిసిన వర్షాలకు అనేక మంది రైతులు పంట నష్టపోయారని కేవలం 6 కోట్ల 90 లక్షల రూపాయలు మాత్రమే పరిహారాన్ని అందజేసి, మిగతా రైతులకు రావాల్సిన 21 కోట్ల వేల రూపాయల పరిహారాన్ని అందజేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక మేటలు వేసిన పంటలకు కూడా ఒక రూపాయి ఇవ్వలేదన్నారు. రుణమాఫీ పథకం అయ్యేదా అని ప్రతిపక్ష బీఆర్ఎస్ బిజెపి లు విమర్శలు చేస్తున్నాయని, అది సరైంది కాదని చెప్పారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం స్పష్టంగా డిసెంబర్ 9 నాటికి తీసుకున్న రుణాలపై వడ్డీతో సహా చెల్లిస్తామని ప్రకటించినదని వివరించారు. అయితే మొత్తానికి వడ్డీ చెల్లించడం లేదని ప్రతిపక్ష నేతలు అవగాహన రాహిత్యంలో మాట్లాడడం సరైనది కాదని హితవు పలికారు. పంటల సాగు విషయంలో టిఆర్ఎస్, భారతీయ జనతా పార్టీలు రైతులను ఇబ్బందులకు గురి చేశాయని పేర్కొన్నారు. దొడ్డు బియ్యం తీసుకోబోమని కేంద్ర ప్రభుత్వం చెబితే, సన్న వడ్లు మాత్రమే పండించాలని, పత్తి పంట వేయవద్దని రాష్ట్ర ప్రభుత్వం చెప్పి రైతులను అయోమయానికి గురిచేశాయని అన్నారు. రైతులకు మంచి చేస్తే ఏ ప్రభుత్వాన్ని అయినా ఆశీర్వదిస్తారని, కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల రైతుల్లో ప్రగాఢమైన విశ్వాసం నెలకొందని చెప్పారు. రుణమాఫీ విషయంలో ఎక్కడైనా అవంతరాలు తలెత్తితే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే సవరించి సదరు రైతులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రతిపక్షాలకు సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఎమ్మెల్యే విజయరమణ రావు మరొకసారి ధన్యవాదాలు తెలిపారు.

# శిశువుకు తల్లి పాలే శ్రీ రామ రక్ష

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ**



పెద్దపల్లి : శిశువుకు తల్లి పాలే శ్రీరామ రక్ష అని, తల్లి పాల ప్రాముఖ్యత పై వారోత్సవాల కార్యక్రమాలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో తల్లిపాల వారోత్సవాల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ప్రతిరోజు చేపట్టే కార్యక్రమాల ను జిల్లా సంక్షేమ శాఖ అధికారి వివరించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం తల్లిపాల వారోత్సవాలలోని ప్రతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా మన జిల్లాలో నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. మండల స్థాయిలో వైద్యశాఖ అధికారులు, ఐసిడిఎస్ సంయుక్తంగా సమావేశం నిర్వహించి తల్లి పాల వారోత్సవాల సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాల ప్రణాళిక రూపొందించు కోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. నేటి నుండి ప్రతి అంగన్వాడీ కేంద్రంలో తల్లి పాల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించాలని, అంగన్వాడీ కేంద్రం పరిధిలో ఉన్న గర్భిణీ స్త్రీలు ఈ కార్యక్రమానికి తప్పకుండా హాజరయ్యే విధంగా ముందస్తు సమాచారం అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఆగస్టు 2న జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రి లలో పర్యటించి పుట్టిన బిడ్డలకు గంట లోపు అందించే ముర్రె పాల విశిష్టత వివరించాలని, ముర్రె పాలు బిడ్డ ఎదుగుదలకు రోగ నిరోధక శక్తి పెంచేందుకు దోహదపడు తుందని, ఈ అంశాన్ని విస్తృతంగా గర్భిణీ స్త్రీలకు తెలియజేయాలని అన్నారు. ఈ నెల 3 న అంగన్ వాడి కేంద్రాలలో అన్న సత్రాలను ఏర్పాటు చేసి పిల్లలు, గర్భిణీ స్త్రీలు అందించాల్సిన పౌష్టికాహారం పై అవగాహన కల్పించాలని, ఆగస్టు 5, 6 తేదిలలో గర్భిణీ స్త్రీలు, బాలింతల ఇండ్లకు వెళ్లి తల్లి పాల ప్రాముఖ్యత వివరించాలని, ఈ నెల 7న శివశక్తి మహిళా సంఘాలకు తల్లి పాల ప్రాముఖ్యత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాల పై సమావేశం నిర్వహించాలని అన్నారు. తల్లి పాల వారోత్సవాల కార్యక్రమా ల్లో మండల ప్రత్యేక అధికారులు పాల్గొనాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బండ్ల బాటలో మరో ముగ్గురు...

హైదరాబాద్: గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఎపిసోడ్ తెలంగాణ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో ఇటీవల గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన కృష్ణమోహన్ రెడ్డి కొన్ని రోజుల్లోనే మనసు మార్చుకున్నారు. ఇవాళ కాంగ్రెస్‌కు కటీఫ్ చెప్పి తిరిగి సొంత గూటికీ చేరుకున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బండ్ల తిరిగి గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. బండ్ల ఎపిసోడ్‌తో స్టేట్ పాలిటిక్స్‌లో కొత్త ప్రచారం తెరపైకి వచ్చింది. అధికార కాంగ్రెస్ పార్టీ మొదలుపెట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌కు కౌంటర్‌గా ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఘర్ వాపసీకి తెరలేపినట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి గులాబీ గూటికీ తిరిగి వచ్చారని బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ మొదలైంది. రాష్ట్రంలో గులాబీ పార్టీ పవర్ కోల్పోవడంతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లో పూర్ ఫెర్మామెన్స్ ప్రదర్శించడంతో 10 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కూడా ఇందులో ఒకరే. తాజాగా బండ్ల మనసు మార్చుకుని మళ్లీ సొంత గూటికీ చేరుకోవడంతో.. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన మరో ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా బండ్ల దారిలోనే వచ్చేందుకు సిద్ధమైనట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్‌తో బంధం తెంచుకుని బయటకు వెళ్లిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, చెవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మంత్రి పొంగులేటి అనుచరుడు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తిరిగి సొంత గూటికి రావాలని డిసైడ్ అయినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే ఇవాల ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బీఆర్ఎస్ మాజీ మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డితో భేటీ అయినట్లు జరుగుతోన్న ప్రచారం బీఆర్ఎస్ ఘర్ వాపసీ వార్తలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కాలే యాదయ్య కూడా తిరిగి సొంత గూటికీ వస్తారని బీఆర్ఎస్‌లోని అగ్ర నేతలు బలంగా చెబుతుండటంతో తెలంగాణ పాలిటిక్స్ ముందు ముందు మరింత రసవత్తరంగా మారే సిట్యూవేషన్స్ కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ నుండి ఎమ్మెల్యేల వలసల ప్రవాహం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో మొదలైంది. ఫస్ట్ బీఆర్ఎస్‌ను వీడి అధికారం పార్టీలో చేరింది ఎమ్మెల్యే దానం నాగేందరే. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రారంభించిన ఆపరేషన్ ఆకర్ష్‌తో బీఆర్ఎస్‌లో వలసల ప్రవాహం కొనసాగింది. ఒకరి వెంట ఒకరు గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ లో చేరి కేసీఆర్‌కు వరుస షాకులు ఇచ్చారు.

దానం తర్వాత ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కడియం, పోచారం, సంజయ్, కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్, బండ్ల, గూడెం మహిపాల్ రెడ్డి బీఆర్ఎస్‌కు టాటా చెప్పి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కేసీఆర్ అత్యంత ఆప్తులుగా పేరున్న కడియం శ్రీహరి, పోచారం పార్టీ మారడం గులాబీ పార్టీలో పెద్ద గుబులే రేపింది. అయితే, కాంగ్రెస్‌పై ఆరు నెలల్లోనే వ్యతిరేకత వచ్చిందని, ఆరు గ్యారెంటీల అమలులో జాప్యం రేవంత్ రెడ్డి సర్కార్‌పై ఎఫెక్ట్ చూపించిందని పొలిటికల్ కారిడార్స్‌లో చర్చ జరగడంతో పాటు పార్టీలో చేరే ముందు ఇచ్చిన ప్రియారిటీ ఆ తర్వాత దక్కడం లేదని వాపోతున్న జంపింగ్ లీడర్స్ తిరిగి గులాబీ గూటికీ రావాలని ప్రయత్నాలు షూరు చేసినట్లు టాక్. కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిన ఆపరేషన్ ఆకర్ష్‌కు కౌంటర్‌గా బీఆర్ఎస్ తెరలేపిన ఘర్ వాపసీలో భాగంగా అధికార పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు తిరిగి సొంత గూటికీ వస్తారా లేదా అనేది తెలియాలంటే మరి కొన్ని రోజులు ఆగాల్సిందే.

# ఏజెన్సీల్లో గ్రేహౌండ్స్ జల్లెడ...

వరంగల్: మావోయిస్టు అమరుల వారోత్సవాలు ఆదివారం నుండి ఆగష్టు 3 వరకు జరగనున్నాయి. మండలంలోని కోమటిపల్లి, తొండ్యాల లక్ష్మీపురం, కొత్తూరు మొట్లగూడెం, బుచ్చంపేట, నర్సాయిగూడెం, బాలన్నగూడెం, నర్సింహసాగర్, పూరెడుపల్లి, మల్లూరు, చుంచుపల్లి, వాడగూడెం, రమణక్కపేట, రాజుపేట, వాగొడ్డుగూడెం, రామచంద్రుని పేట, నిమ్మగూడెం, దోమెడ పంచాయతీల పరిదిలోని అటవీ గ్రామాలలో ముమ్మరంగా పోలీస్ కూంబింగ్ చేపట్టారు. వారం రోజుల పాటు మావోయిస్టు అమరులను స్మరిస్తూ వాడ వాడలలో వారోత్సవాలు జరిపి విజయవంతం చేయాలంటూ మావోయిస్టులు ఇప్పటికే పిలుపునిచ్చిన నేపద్యంలో పోలీసులు అడవులను గొత్తికోయ ఆవాసాలున్న అటవీ ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. మావోయిస్టు వారోత్సవాలను విఫలం చేసేందుకు పోలీసు యంత్రాంగం దృష్టి సారించింది. మంగపేట మండలంతో పాటు ఏటూరునాగారం సబ్ డివిజన్ పరిధిలోని కన్నాయిగూడెం, వాజేడు, పేరూరు, వెంకటాపురం (నూగూరు) మండలాల్లోని అటవీ ప్రాంతాల్లో ఇప్పటికే గ్రేహౌండ్స్, సీఆర్పీఎఫ్, కేంద్ర బలగాలు గ్రీన్ హంట్ పేరుతో కూంబింగ్ నిర్వహిస్తుయి. మావోయిస్టుల్లో గొత్తికోయలున్నారనే సమాచారం మేరకు అటవీ ప్రాంతాల్లోని వారి ఆవాసాలను లక్ష్యంగా చేసుకుని గూడాల్లో మావోయిస్టుల పాల్ పోస్టర్లు అంటించి సోదాలు, కార్డన్ సర్చ్ లు చేస్తూ అనుమానితుల సంచారం కోసం ఆరాతీస్తున్నారు. గొత్తికోయలతో సమావేశమై పరిచయంలేని వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వవద్దని హెచ్చరిస్తున్నారు. ఈ నెల 25న జిల్లాలోని తాడ్వాయి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం సరిహద్దు దామరతోగు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో నల్లమారి అశోక్ ఏ విజెందర్ అనే మావోయిస్టు దళ సభ్యుడు మృతి చెందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్కౌంటర్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం భాద్యత వహించాలంటూ మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం అల్లూరి సీతారామరాజు డివిజన్ కార్యదర్శి ఆజాద్ పేర ప్రకటన విడుదల చేయడంతో పోలీసులు మండలంలోని అధికార పార్టీ నేతలను అప్రమత్తం చేశారు. వారోత్సవాల సందర్భంగా మావోయిస్టులు తమ ఉనికి చాటుకునేందుకు ఏదైనా దుశ్చర్యలకు పాల్పడే అవకాశాలున్నట్లు ఇంటెలిజెన్స్ సమాచారం ఉండడంతో వారోత్సవాలు ముగిసే వరకు మండలంలో యాక్టివ్ గా ఉండే నాయకులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తమ అనుమతులు లేకుండా గ్రామాలకు వెళ్లవద్దని పర్యటనలను రద్దు చేసుకోవాలని హెచ్చరికలు జారీ చేసినపట్లు సమాచారం. వారోత్సవాలను విజయవంతం చేయాలని మావోయిస్టులు మరోపక్క విఫలం చేసే పనితో పోలీసులు నిత్యం అటవీ గ్రామాల్లో సోదాలు తనిఖీలు చేస్తుండడంతో నిర్వహించడం మండలంలోని గిరిజన గ్రామాల్లో ఎప్పుడేం జరుగుతుందోనని యువకులు ఆందోళన చెందుతున్నారు. తెల్లవారక ముందే పోలీసులు తెల్లవార్లు మావోయిస్టుల భయం వెంటాడుతుండడంతో యువకులు గ్రామాలను విడిచిపోతున్నారు. మండలంలో గతంలో మావోయిస్టు ప్రాభల్యం ఉన్న కమలాపురం, తిమ్మంపేట, నర్సింహసాగర్, రామచంద్రునిపేట, రాజుపేట పంచాయతీలపై పోలీసుల నిఘా పెంచడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మావోయిస్టు వారోత్సవాలు ముగిసే వరకు గ్రామాల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోనని ఆందోళన చెందుతున్నారు.

# కనీసం శ్రావణంలో అయినా... మంత్రి వర్గ విస్తరణ ఉంటుందా

హైదరాబాద్: తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై చాలామంది నేతలు ఆశలు పెట్టుకున్నారు. ఆషాఢం ముగిసి?శ్రావణ మాసం వస్తుండడంతో..ఉందిలే మంత్రీ కాలం ముందు ముందునా అని పాడుకుంటున్నారు. రేవంత్ కేబినెట్‌లో ఆరు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. నెల రోజుల క్రితమే సీఎం రేవంత్ ఢిల్లీకి వెళ్లడం, కాంగ్రెస్ సీనియర్లు కూడా హస్తినకు వెళ్లడంతో.. మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని అప్పట్లో బాగా ప్రచారం జరిగింది. అయితే కూడికలు తీసివేతలు ఓ కొలిక్కి రాలేదో ఏమో గానీ.. ఆషాఢం ఆశలకు ఫుల్ స్టాప్ పడింది. శ్రావణంలో మంత్రి వర్గం విస్తరణ చేద్దాం, అప్పుడే చూద్దాం అని అధిష్టానం చెప్పడంతో ఈ ఆశలకు టెంపరరీగా కామా పడింది. అయితే ఇప్పుడు శ్రావణ మాసం ముంచుకొస్తున్న శుభ ముహూర్తాన ఆశావహుల్లో మళ్లీ కదలిక మొదలైంది. మంత్రివర్గ బెర్తులపై కర్చీఫులు వేయడం మొదలైంది. మొన్న మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, తుంగతుర్తి ఎమ్మెల్యే శామ్యూల్, మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ, నకిరేకల్ శాసనసభ్యుడు వేముల వీరేశం, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు? సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. తమ సామాజిక వర్గాన్ని కూడా దృష్టిలో పెట్టుకోండి అంటూ సీఎం దృష్టిలో పడ్డారు. ఇక లేటెస్ట్‌గా ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఎంట్రీ ఇచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 34 అసెంబ్లీ సీట్లలో కాంగ్రెస్ తరఫున గెలిచింది తాను ఒక్కడినే కాబట్టి, మంత్రివర్గం విస్తరణలో తనకు అవకాశం వస్తుందంటున్నారు ఆయన. మూడు సార్లు గెలిచిన సీనియర్ కావడంతో, ఆషాఢం తర్వాత అవకాశం ఉంటుందని ఆయన బోలెడు ఆశలు పెట్టుకున్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా తనకు చాన్స్ ఉంటుందని నమ్ముతున్నారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్.. ఎస్టీ కోటాలో కర్చీఫ్ వేసుకుని కూర్చున్నారు. ఆశావహుల జాబితాలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనకు గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం కూడా ఉంది. చెన్నూరు ఎమ్మెల్యే, మాల సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేత గడ్డం వివేక్ కూడా తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన గతంలో ఎంపీగా కూడా పనిచేశారు. మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి పేరు కూడా గట్టిగానే వినిపిస్తోంది. ముదిరాజ్ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇస్తామని పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ స్వయంగా ప్రకటించడం.. శ్రీహరికి కలిసివచ్చే అంశంగా భావిస్తున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు పేరు కూడా ఆశావహుల జాబితాలో ఉంది. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కూడా తన వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. అయితే 6 బెర్తులు ఖాళీగా ఉన్నా?ప్రస్తుతం ఐదుగురిని కొత్తగా మంత్రి వర్గంలోకి తీసుకుంటారని, మైనారిటీ కోటాను తర్వాత భర్తీ చేస్తారని చెబుతున్నారు. పలువురు ఆశావహులు శ్రావణ పల్లకీలో విహరిస్తున్నారు.

# అసంతృప్తా...గొంతెమ్మ కోరికలా

మహబూబ్ నగర్: బీఆర్ఎస్ పార్టీ ఘర్‌వాపసీ మొదలు పెట్టింది. కాంగ్రెస్ పార్టీకి ఝలక్ ఇస్తూ అందులో చేరిన తమ ఎమ్మెల్యేలను తిరిగి వెనక్కి తెచ్చుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు తెలుస్తున్నది. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన నలుగురు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ ఫోకస్ పెట్టింది. ఆ నలుగురు ఎమ్మెల్యేలు త్వరలోనే గులాబీ గూటికి వస్తారని బీఆర్ఎస్ పెద్దలు చెబుతున్నారు. ఇప్పటికే ఒక ఎమ్మెల్యే తాను బీర్ఎస్‌లోకి వచ్చినట్టు ప్రకటించగా.. మరో ఎమ్మెల్యే తాజాగా కేటీఆర్‌తో భేటీ అయ్యారు. భద్రాచల్లం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యలు బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలిచారు. వీరు ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే, బీఆర్ఎస్ ఘర్‌వాపసీ ఆపరేషన్ ప్రారంభిం చిందని, త్వరలోనే ఈ నలుగురు బీఆర్ఎస్ పార్టీలో చేరుతారని చెబుతున్నారు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి ఇప్పటికే తాను బీఆర్ఎస లో చేరినట్టు ప్రకటించారు. ఇక భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ప్రశాంత్ రెడ్డితో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో భేటీ అయ్యారు. త్వరలోనే ఆయన మళ్లీ బీఆర్ఎస్‌లోకి తిరిగి రాబోతున్నట్టు తెలుస్తున్నది. వీరితోపాటు జగిత్యాల ఎమ్మెల్యే సంజ్ కుమార్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య లు కూడా త్వరలోనే బీఆర్ఎస్ పార్టీలో చేరుతారని బీఆర్ఎస్ పెద్దలు చెబుతున్నారు. ఒకరి వెంట ఒకరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ బాటపట్టడంతో గులాబీ పార్టీ ఆందోళనకు గురైంది. దీనికితోడు లోక్ సభ ఎన్నికల్లోనూ ఫలితాలు ఏమీ రాకపోవడంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొంటున్నది. ఈ నేపథ్యంలోనే గులాబీ పెద్దలు కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. ఘర్ వాపసీకి తెరలేపి పార్టీలో మళ్లీ ఒక కొత్త స్థైర్యాన్ని నింపే ప్రయత్నాలు చేస్తున్నట్టు అర్థం అవుతున్నది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ నాయకులు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఫిర్యాదులు చేశారు. హైకోర్టును కూడా ఆశ్రయించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ తదుపరి విచారణ వచ్చే నెల 1వ తేదీకి ఉన్నది. ఈ నేపథ్యంలో కీలక పరిణామాలు జరుగుతున్నాయి. ఖైరతాబాద్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ టికెట్ పై గెలిచి కాంగ్రెస్‌లో చేరారు. ఆ తర్వాత కాంగ్రెస్ టికెట్ పై సికింద్రాబాద్ పార్లమెంటు సీటుకు పోటీ చేసి ఓడిపోయారు. ఇక కడియం శ్రీహరి బీఆర్ఎస్ టికెట్ పై గెలిచి కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ వరంగల్ లోక్ సభ టికెట్ కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యకు ప్రకటించిన తర్వాత తిరస్కరించారు. ఇద్దరు కలిసి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ టికెట్ పైనే కడియం కావ్య వరంగల్ ఎంపీగా గెలిచారు. ఇక జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. కొన్నిరోజులపాటు అలక పట్టడంతో ఢిల్లీ పెద్దలు బుజ్జగించాల్సి వచ్చింది. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి.. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. అసెంబ్లీలో కేటీఆర్‌తో గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి సమావేశమయ్యారు. ఈనెల 6న ఆయన బీఆర్ఎస్ పార్టీని వీడి సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇంతలోనే యూటర్న్ తీసుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే గత ఆరు రోజులుగా అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న విషయం తెలిసిందే. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కేటీఆర్ ను కలిసిన గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి.. ఇక నుంచి బీఆర్ఎస్ లోనే కొనసాగుతానని చెప్పారు.

# పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు: ఎఫ్ఆర్ఓ కోట సత్తయ్య

తాడ్వాయి : పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు జీవకోటికి ప్రాణవాయువు అందించే వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని తాడ్వాయి టెరిటోరియల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కోట సత్తయ్య అన్నారు. మంగళవారం వన మహోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఫారెస్ట్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎఫ్ ఆర్ ఓ కోట సత్తయ్య మాట్లాడుతూ తెలంగాణలో వనం ముహూర్చ కార్యక్రమాన్ని యజ్ఞంలో భావించి మొక్కలు నాటి సంరక్షిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, విద్యార్థి దశ నుండే ముక్కలు నాటి, నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం అలవర్చుకోవాలన్నారు. మనిషి ఆరోగ్యంగా మంచి ఆక్సిజన్ స్వీకరించాలంటే ఎన్ని కోట్లు ఖర్చుపెట్టినా స్వచ్ఛమైన ఆక్సిజన్ తీసుకోలేమన్నారు. కానీ ఒక చెట్టు ద్వారా ఎంతో స్వచ్ఛమైన ఆక్సిజన్ తీసుకోవచ్చని మరియు పచ్చని చెట్ల వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని, వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ కార్యాలయాల్లో గట్లపైన వీలైన ప్రతి చోట మొక్కలు నాటి, నాటిన ప్రతి మొక్కను, సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సక్రు నాయక్, ఎఫ్ ఎస్ ఓ లు లక్ష్మీనరసు, విద్యాసాగర్, ఎఫ్ బి ఓ లు కుడుముల బక్కయ్య, శ్రీకాంత్, తిరుపతి, తాడ్వాయి కేజీబీవీ ప్రిన్సిపల్ ఇంప పుష్పలత, బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పారిస్ ఒలింపిక్స్: స్వప్నిల్‌కు షూటింగ్‌లో కాంస్యం, భారత్ ఖాతాలో మరో పతకం



పారిస్ ఒలింపిక్స్‌లో భారత షూటర్ స్వప్నిల్ కుసాలె కాంస్య పతకం సాధించాడు.
పురుషుల 50 మీటర్ల ఎయిర్ రైఫిల్ త్రీ పొజిషన్ షూటింగ్ ఈవెంట్‌లో ఈ పతకం గెలిచాడు.
ఫైనల్లో స్వప్నిల్ 454.1 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు.
ఈ విభాగంలో చైనా షూటర్ యుకున్ లియు స్వర్ణాన్ని గెలుచుకోగా, యుక్రెయిన్ షూటర్ సెర్హీ కులిష్ రజతాన్ని గెలిచాడు.
పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ఇది మూడో పతకం.
ఈ మూడు పతకాలు షూటింగ్‌లోనే వచ్చాయి.
తాజా పతకంతో ఒలింపిక్స్ చరిత్రలో షూటింగ్ ఈవెంట్‌లో భారత్ సాధించిన పతకాల సంఖ్య ఏడుకు చేరింది.
50మీ. రైఫిల్ త్రీ పొజిషన్‌లో భారత్‌కు ఇదే తొలిపిక్ పతకం. రైఫిల్ షూటింగ్ ఈవెంట్‌లో రెండోది.
2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో 10మీ. ఎయిర్ రైఫిల్ విభాగంలో అభినవ్ బింద్రా స్వర్ణాన్ని గెలిచారు.
ఫైనల్లో ఒత్తిడిగా అనిపించిందని, కానీ తర్వాత కాంస్యం గెలవడం చాలా సంతోషంగా ఉందని మెడల్ గెలిచిన అనంతరం స్వప్నిల్ అన్నారు.
"ఇన్నేళ్లుగా చేస్తూ వస్తున్నదే ఈరోజూ చేశాను. నా మెదడులో కొన్ని "కీవర్డ్స్" పెట్టుకున్నాను. కేవలం శ్వాసపైనే నా దృష్టి కేంద్రీకరించా. చాలా ఆనందంగా ఉంది. ఇంకా నమ్మలేకపోతున్నా" అని స్వప్నిల్ హర్షం వ్యక్తం చేశారు.
28 ఏళ్ల స్వప్నిల్ స్వస్థలం మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లాలో ఉన్న కంబల్‌వాడి గ్రామం. ఆయన తండ్రి వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు కాగా, తల్లి అనిత కంబాల్‌వాడీ గ్రామ సర్పంచ్.
తమ కుమారుడికి ఆటలపై ఉన్న ఆసక్తిని చూసి వారు స్వప్నిల్‌ను నాసిక్‌లోని స్పోర్ట్స్ స్కూల్‌లో చేర్చారు. ఇక్కడే ఆయన షూటింగ్ ప్రయాణం మొదలైంది. 2009లో 14 ఏళ్ల వయస్సు నుంచి ఆయన షూటింగ్ ప్రాక్టీస్ చేస్తున్నారు.
2022లో జరిగిన ఆసియా క్రీడల్లో స్వప్నిల్ బంగారు పతకం సాధించాడు.
గత 12 ఏళ్లలో మొదట జూనియర్ స్థాయిలో, తర్వాత సీనియర్ కేటగిరీలో స్వప్నిల్ అనేక జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లలో పాల్గొన్నారు.
అయితే ఒలింపిక్స్‌కు వెళ్లడం ఇదే తొలిసారి.
"స్వప్నిల్ షూటింగ్ ప్రాక్టీస్ కోసం ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు. ఇన్నేళ్లలో అతనికి షూటింగ్‌పై విసుగు వచ్చినట్లుగా నాకెప్పుడూ అనిపించలేదు. అతను చాలా ప్రశాంతంగా, క్రమశిక్షణతో ఉంటాడు" అని బీబీసీతో స్వప్నిల్ తండ్రి సురేశ్ కుసాలె చెప్పారు.
షూటింగ్ క్రీడ చాలా ఖరీదైనది. రైఫిల్స్, జాకెట్ల కోసం ఖర్చు చేయాలి. ఒక్క బుల్లెట్ కొనడానికి కూడా చాలా డబ్బు ఖర్చవుతుంది.
ప్రాక్టీస్ కోసం బుల్లెట్‌లు కొనడానికి సరిపడా డబ్బు లేకపోవడంతో తన తండ్రి అప్పు చేశారని ఒక సందర్భంలో స్వప్నిల్ చెప్పారు.
"ప్రాక్టీస్ ఆపకూడదని, మా నాన్న బ్యాంకు నుంచి అప్పు తీసుకొని బుల్లెట్లు కొనిచ్చారు. అప్పుడు ఒక్క బుల్లెట్ ఖరీదు 120 రూపాయలు. అందుకే షూటింగ్ ప్రాక్టీస్ చేసేటప్పుడు ప్రతీ బుల్లెట్‌ని నేను జాగ్రత్తగా వాడాను. ఈ ఆటను మొదలుపెట్టినప్పుడు నా దగ్గర తగినన్ని పరికరాలు కూడా లేవు" అని మీడియాతో స్వప్నిల్ చెప్పారు.
తల్లిదండ్రులతో పాటు కోచ్ దీపాలీ దేశ్‌పాండే తనకు ఎంతో సహకరించారని స్వప్నిల్ చెప్పారు.
షూటింగ్ కెరీర్ ఆరంభంలో 'లక్ష్య స్పోర్ట్స్' సంస్థ స్వప్నిల్‌కు అండగా నిలిచింది.
తర్వాత భారతీయ రైల్వే ఆయనకు ఉద్యోగం ఇచ్చింది.
2015 నుంచి సెంట్రల్ రైల్వేలోని పుణే డివిజన్‌లో టీటీఈగా ఆయన పనిచేస్తున్నారు.
తర్వాత బాలేవాడీలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ క్రీడా ప్రబోధినిలో ఆయన షూటింగ్ ప్రాక్టీస్ చేశారు.
స్వప్నిల్ ఏళ్ల పాటు బలహీనత, జ్వరం, తీవ్రమైన నొప్పులతో బాధపడ్డారని ఆయనకు మెంటార్‌కు వ్యవహరించిన విశ్వజిత్ షిండే తెలిపారు.
"అతని అనారోగ్యానికి కారణం ఏంటో చాలా కాలం పాటు తెలియలేదు. ఆరోగ్యం సహకరించకపోయినప్పటికీ ఆటను మాత్రం కొనసాగించాడు. ఎట్టకేలకు 2003 డిసెంబర్‌లో స్వప్నిల్ సమస్యకు మూలం ఏంటో తెలిసింది. స్వప్నిల్‌కు పాలతో ఎలర్జీ అని తేలింది. పాలలోని లాక్టోస్ కారణంగా స్వప్నిల్ పాలు, పాల ఉత్పత్తులు తినడం మానేయాల్సి వచ్చింది. అప్పటి నుంచి ఆయన ఆరోగ్యం కూడా మెరుగుపడింది" అని ఆయన వెల్లడించారు.

# బ్యాడ్మింటన్‌లో 'నో-లుక్ షాట్'.. ఒలింపిక్స్‌లో ప్రకంపనలు సృష్టించిన లక్ష్య సేన్..



క్రికెట్‌లో ఎన్నో వెరైటీ షాట్లు ఉన్నాయి. వీటిని చూసి అభిమానులు ఆశ్చర్యపోతుంటారు. వాటిలో నో లుక్ షాట్ చాలా ఫేమస్.
భారత వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్ దాని స్పెషలిస్ట్‌గా పరిగణిస్తుంటారు. ఇప్పుడు ఈ షాట్ పారిస్ ఒలింపిక్స్‌లో కూడా కనిపించింది. అయితే, ఈసారి అది క్రికెట్‌లో కాకుండా బ్యాడ్మింటన్‌లోనూ కనిపించింది. భారత యువ స్టార్ లక్ష్యసేన్ బుధవారం (జులై 31) అద్భుతాలు చేశాడు.
ప్రీక్వార్టర్‌ఫైనల్ చేరిన లక్ష్య సేన్..
పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ ఇండోనేషియాకు చెందిన మూడో సీడ్ జోనాథన్ క్రిస్టీని వరుస గేముల్లో ఓడించి సంచలనం సృష్టించాడు. దీంతో అతడు ప్రీక్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు. మొదటి గేమ్‌లో ఆరు పాయింట్లతో వెనుకబడిన తర్వాత, లక్ష్య అద్భుత పునరాగమనం చేసి గేమ్ చివరి దశలో క్రిస్టీని ఓడించాడు. 22 ఏళ్ల లక్ష్య ఒత్తిడిలో ప్రశాంతంగా ఉండి కీలకమైన ర్యాలీలో అద్భుతమైన షాట్‌తో క్రిస్టీ స్ఫూర్తిని చల్లార్చాడు.
లక్ష్య అద్భుతమైన షాట్ చేశాడు. బ్యాడ్మింటన్ పరంగా ఇది ఫోర్‌హ్యాండ్ షాట్. కానీ, దీనిని వెనుక నుంచి కొట్టాడు. ఇది సరిగ్గా క్రికెట్‌లో నో-లుక్ షాట్ లాగానే ఉంది. లక్ష్యసేన్ కళ్ళు మాత్రం వేరేవైపు ఉండడం గమనార్హం. నెట్ మీదుగా వెళ్లడమే కాకుండా స్కోరు 20-18కి చేర్చాడు. ఆ తర్వాత రెండో గేమ్‌లో 50 నిమిషాల్లో క్రిస్టీపై 21-12 తేడాతో విజయం సాధించాడు.
తదుపరి రౌండ్‌లో ప్రణయ్‌కు గట్టి పోటీ..
క్రిస్టీతో జరిగిన ఆరు మ్యాచ్‌ల్లో సేన్‌కి ఇది రెండో విజయం. లక్ష్య ఇప్పుడు మరో గ్రూప్ విజేతతో తలపడనున్నాడు. స్వదేశీయుడు హెచ్ఎస్ ప్రణయ్, వియత్నాంకు చెందిన లే డక్ ఫాట్ మధ్య జరిగే మ్యాచ్ ద్వారా నిర్ణయించనున్నారు. సమాన పాయింట్ల కారణంగా, బుధవారం సాయంత్రం సేన్, క్రిస్టీ మాదిరిగానే ప్రణయ్, డుక్ ఫట్ వర్చువల్ నాకౌట్ మ్యాచ్‌లో పాల్గొంటారు.

# రిటైర్మెంట్‌పై మౌనం వీడిన రోహిత్ శర్మ



భారత జట్టు ప్రస్తుతం శ్రీలంక పర్యటనలో బిజీగా ఉంటోంది. ఇప్పటికే మూడు టీ20 ఇంటర్నేషనల్స్ సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఆడిన మూడింట్లోనూ ఘన విజయాన్ని అందుకుంది. లంకేయులను 3-0 తేడాతో మట్టికరిపించింది. సూపర్ ఓవర్ దాకా వెళ్లిన చివరి మ్యాచ్ మినహా మిగిలిన రెండింట్లోనూ వార్ వన్‌సైడ్ అయింది.
ఇక వన్డే ఇంటర్నేషనల్స్ సిరీస్ ఆరంభం కాబోతోంది. శుక్రవారమే తొలి వన్డే. మధ్యాహ్నం 2:30 గంటలకు మ్యాచ్ మొదలవుతుంది. కొలంబోలోని ప్రేమదాస స్టేడియం దీనికి ఆతిథ్యాన్ని ఇస్తోంది. 4, 7 తేదీల్లో మిగిలిన రెండు మ్యాచ్‌లు కూడా షెడ్యూల్ అయ్యాయి. ఈ రెండూ కూడా ఈ స్టేడియమే వేదిక.
సిరీస్ ఆరంభం కాబోతోన్న నేపథ్యంలో ప్రేమదాస స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రీ మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు రోహిత్ శర్మ. అనేక విషయాలపై స్పందించాడు. టీ20 ఇంటర్నేషనల్స్ నుంచి రిటైర్మెంట్ కావడం, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో ఉన్న సంబంధాల గురించీ చెప్పుకొచ్చాడు.
టీ20 ఇంటర్నేషనల్స్ నుంచి అసలు రిటైర్ అయినట్టే లేదని రోహిత్ వ్యాఖ్యానించాడు. ఆ ఫార్మట్ మ్యాచ్‌లు, సిరీస్‌ల నుంచి తనకు విశ్రాంతి ఇచ్చినట్టుగా ఉందని పేర్కొన్నాడు. మిగిలిన రెండు ఫార్మట్లు- వన్డే ఇంటర్నేషనల్స్, టెస్టుల్లో కొనసాగుతోండటం వల్ల..క్రికెట్‌కు దూరం అయ్యాననే ఫీలింగ్ రావట్లేదని అన్నాడు.
అపారమైన క్రికెట్ ఆడిన అనుభవం గౌతమ్ గంభీర్‌కు ఉందని రోహిత్ శర్మ చెప్పాడు. రిటైర్ అయిన తరువాతా క్రికెట్‌కు ఏనాడూ దూరంగా లేడని, హెడ్ కోచ్‌గా అపాయింట్ కాకముందు ఐపీఎల్‌లో వివిధ ఫ్రాంచైజీల కోసం పని చేశాడని గుర్తు చేశాడు. గంభీర్‌తో మ్యాచ్‌లను ఆడిన అనుభవం ఉందని, కోచ్‌గా తనదైన ముద్ర వేస్తాడని ఆశిస్తోన్నట్లు వివరించాడు.
శ్రీలంకతో తొలి వన్డే ఆడబోయే తుదిజట్టు గురించి మాట్లాడుతూ కేఎల్ రాహుల్, రిషబ్ పంత్‌లలో ఒకరిని తుది జట్టులోకి తీసుకోవడం అనేది చాలా కష్టమని, ఇద్దరూ మ్యాచ్ విన్నర్లేనని వ్యాఖ్యానించాడు. అలాంటి పోటీ జట్టులో ఎప్పుడూ ఉండాలని కోరుకుంటున్నానని, అప్పుడే మెరికల్లాంటి ప్లేయర్లు బయటికొస్తారని అన్నాడు.

# ఐపీఎల్ మెగా వేలం.. ఆ అంశంపై షారుఖ్, వాడియా మధ్య వాగ్వాదం




ఐపీఎల్ మెగా వేలం రాబోతున్న తరుణంలో.. ఫ్రాంచైజీ యజమానులు, ఐపీఎల్ పాలక మండలి మధ్య సమావేశం జరిగింది. ముంబై వేదికగా బుధవారం రాత్రి జరిగిన ఈ భేటీలో..
మెగా వేలం నిర్వహణ, రిటెన్షన్, ఇంపాక్ట్ రూల్‌పై ప్రధానంగా చర్చించారు. అయితే.. ఇది అసంపూర్తిగానే ముగిసిందని, ముఖ్యంగా మెగా వేలం నిర్వహణకు ఫ్రాంచైజీలు ఆసక్తి కనబరచలేదని తెలుస్తోంది. ఈ సందర్భంగానే.. కోల్‌కతా నైట్ రైడర్స్ యజమాని షారుఖ్ ఖాన్ , పంజాబ్ కింగ్స్ యజమాని నెస్ వాడియా మధ్య వాగ్వాదం జరిగిందని సమాచారం.
షారుఖ్, వాడియా మధ్య వాగ్వాదం
ఐపీఎల్-2025కు నిర్వహించబోయే మెగా వేలాన్ని షారుఖ్ ఖాన్ వ్యతిరేకిస్తూ.. రిటెన్షన్ ఆటగాళ్ల పరిమితిని పెంచాల్సిందిగా షారుఖ్ ఈ భేటీలో గొంతెత్తినట్టు తెలిసింది. కేవలం నలుగురిని మాత్రమే కాదు.. ఎక్కువ మందిని రిటైన్ చేసుకునే అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఫలితంగా.. భవిష్యత్తులో సూపర్‌స్టార్లు ఎదిగే ఎదగాళ్లకు మద్దతు ఇచ్చినట్లు అవుతుందన్న విషయాన్ని హైలైట్ చేశారట. అయితే.. నెస్ వాడియా మాత్రం రిటెన్షన్ సంఖ్యను పెంచాల్సిన అవసరం లేదని, నలుగురు మాత్రమే చాలని వాదించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే.. షారుఖ్, వాడియా మధ్య కాస్త వాగ్వాదం చోటు చేసుకుందని వార్తలొస్తున్నాయి. ఇదే సమయంలో షారుఖ్‌ని సన్‌రైజర్స్ యాజమాన్యం మద్దతు తెలిపిందని, కనీసం 8 మందిని రిటైన్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు.
నెక్ట్స్ ఏంటి?
బుధవారం రాత్రి జరిగిన సమావేశం అసంపూర్తిగా ముగిసింది కాబట్టి.. మరోసారి భేటీ జరగొచ్చని క్రికెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. మేగా వేలంపై ఇంకా ఏకాభిప్రాయానికి రావాల్సి ఉందని, అదే రిటెన్షన్ సంఖ్యను నిర్దేశించనుందని చెప్తున్నాయి. ఒకవేళ బీసీసీఐ మెగా వేలం నిర్వహించకూడదని భావిస్తే.. అప్పుడు రిటెన్షన్ అవసరమే ఉండకపోవచ్చని అంటున్నాయి. ఇంపాక్ట్ రూల్‌పై విమర్శలు వస్తున్నా.. దాని వల్ల కొత్త వారికి అవకాశం లభిస్తుందని కొన్ని ఫ్రాంచైజీలు అభిప్రాయపడినట్లు క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. అలాగే.. మెగా వేలం అంశంపై షారుఖ్, వాడియా మధ్య వాగ్వాదం జరిగిందని.. వేలం నిర్వహించొద్దని షారుఖ్ పేర్కొంటే, అందుకు వ్యతిరేకంగా వాడియా వాదించారని స్పష్టం చేశాయి. మరి.. మెగా వేలం నిర్వహిస్తారా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే.
కావ్య మారన్ వాదన ఏంటి?
ఒక జట్టును నిర్మించడానికి చాలా సమయం పడుతుందని, అలాగే యువ ఆటగాళ్లు పరిణతి చెందడానికి కూడా కొంత టైం పడుతుందని కావ్య మారన్ పేర్కొన్నారు. ఇందుకు అభిషేక్ శర్మ ప్రస్థానాన్ని ఉదహరించారు. అభిషేక్‌కు ఇప్పుడున్న స్థానానికి చేరుకోవడానికి మూడేళ్ల సమయం పట్టిందని, ఇతర జట్లలోనే ఇలాంటి ఆటగాళ్లు ఎందరో ఉన్నారన్న విషయాన్ని అందరూ అంగీకరించాల్సిందేనని అన్నారు.

# పారిస్ ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు ఓటమి



పారిస్ ఒలింపిక్స్ 2024లో భారత హాకీ జట్టు బెల్జియం చేతిలో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. టోక్యో ఒలింపిక్స్‌లో సెమీ ఫైనల్స్‌లో కూడా బెల్జియం భారత్‌ను ఓడించింది.
పూల్-బిలో ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో బెల్జియం 2-1తో భారత్‌ను ఓడించింది. భారత్ తరఫున అభిషేక్ సింగ్ 18వ నిమిషంలో గోల్ సాధించాడు. బెల్జియం తరఫున తిబౌట్ స్టాక్‌బ్రూక్స్, జాన్ డోహ్మెన్ గోల్స్ చేశారు. తొలి క్వార్టర్‌లో భారత్ పొరపాట్లు చేయగా 8వ నిమిషంలో బెల్జియంకు తొలి పెనాల్టీ కార్నర్ లభించింది. అయితే, మొదటిసారి అమిత్ రోహి దాస్ సేవ్ చేయగా, మళ్లీ శ్రీజేష్ అద్భుతమైన సేవ్ చేశాడు. 10వ నిమిషంలో అభిషేక్ సింగ్ ఫీల్డ్ గోల్ చేసేందుకు ప్రయత్నించగా.. బెల్జియం గోల్ కీపర్ గోల్ అనుమతించలేదు. తొలి క్వార్టర్‌లో గోల్‌లు నమోదు కాలేదు.
రెండో క్వార్టర్‌లో భారత్ ముందంజ
రెండో క్వార్టర్‌లో భారత్ దూకుడుగా ఆడి తొలి గోల్ చేసింది. 18వ నిమిషంలో బెల్జియం డిఫెండర్లను దాటవేస్తూ అభిషేక్ అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేశాడు. అంతకుముందు వివేక్ సాగర్ షాట్ మిస్ అయితే, అభిషేక్ ఎలాంటి పొరపాటు చేయలేదు. 23, 24 నిమిషాల్లో బెల్జియంకు పెనాల్టీ కార్నర్లు లభించాయి. అయితే శ్రీజేష్ అద్భుతంగా ఆదుకున్నాడు. 25వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను భారత్ మిస్ చేసుకుంది. 26వ నిమిషంలో టామ్ బూన్ గ్రీన్ కార్డ్ పొంది రెండు నిమిషాల పాటు మైదానం వీడాడు. తొలి అర్ధభాగంలో భారత్ 1-0 ఆధిక్యంలో ఉంది.
మూడో క్వార్టర్‌లో బెల్జియం ముందంజ
మూడో క్వార్టర్‌లో భారత్ ఒత్తిడితో ఆడుతున్నట్లు కనిపించింది. దీన్ని సద్వినియోగం చేసుకున్న బెల్జియం 33వ నిమిషంలో థిబ్యూ స్టాక్‌బ్రోక్స్ ఫీల్డ్ గోల్‌తో జట్టును సమం చేసింది. 43వ, 44వ నిమిషాల్లో బెల్జియంకు పెనాల్టీ కార్నర్ లభించగా, దాన్ని శ్రీజేష్ కాపాడాడు. అయితే, 44వ నిమిషంలో జాన్ డోహ్మెన్ చేసిన గోల్‌తో బెల్జియం 2-1 ఆధిక్యంలోకి వెళ్లింది. భారత్‌కు కూడా పెనాల్టీ కార్నర్ లభించినా అమిత్ రోహి దాస్ దానిని సద్వినియోగం చేసుకోలేకపోయాడు.నాలుగో క్వార్టర్‌లో ఇరు జట్లు దూకుడుగా ఆడాయి. 51వ నిమిషంలో భారత్‌కు గోల్ చేసే అవకాశం లభించినా, అభిషేక్, సుమిత్ గోల్ చేయలేకపోయారు. బెల్జియంకు పెనాల్టీ కార్నర్ లభించినా దానిని గోల్‌గా మార్చలేకపోయింది. 54వ నిమిషంలో రాజ్‌కుమార్ పాల్‌కు ఎల్లో కార్డ్ లభించింది. చివరి నిమిషంలో భారత్‌కు పెనాల్టీ కార్నర్ లభించింది, కానీ భారత్ గోల్ చేయలేకపోయింది, దీంతో భారత్ 2-1తో మ్యాచ్‌ను కోల్పోయింది.

# :ఒక వేదిక ఒక సెల్ఫీ-ఆ శత్రు దేశాలను కలిపిన ఒలింపిక్స్




ఆ రెండు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా పరిస్థితులున్నాయి. ఒక దేశాధ్యక్షుడు ప్రపంచాన్నే గడగడలాడిస్తాడనే పేరుంది.ఎవరైతే నాకేంటి అనే స్థాయిలో ఆ దేశాధ్యక్షుడి వ్యవహార శైలి ఉంటుంది.
అగ్రరాజ్యం అమెరికానే తన ఆలోచనలు, నిర్ణయాలతో వణికించిన నియంత. ఇప్పటికే ఎవరో మీకు అర్థమై ఉంటుంది. అవును మీరు ఊహించింది నిజమే. ఆ నియంతే ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్. దక్షిణ కొరియా సరిహద్దు నుంచి ఉత్తరకొరియా సరిహద్దులోకి ఒక చీమ వచ్చిన అత్యంత పాశవికంగా వ్యవహరిస్తారు కిమ్ జాంగ్ ఉన్. అలాంటిది రెండు దేశాలకు చెందిన వ్యక్తులు ఒకే వేదికపై నిల్చొని సెల్ఫీలు దిగారు.. ఇంతకీ వారెవరు ఆ స్టోరీ ఏంటి..?
ఉత్తరకొరియా- దక్షిణ కొరియా దేశాలకు చెందిన క్రీడాకారులు ఒకే వేదికపై సెల్ఫీలు తీసుకుంటూ కనిపించారు. ఇందుకు వేదికగా నిలిచింది పారిస్ ఒలింపిక్స్. వాస్తవానికి ఇరు దేశాల మధ్య వైరం ఉన్నప్పటికీ అది క్రీడల్లో మాత్రం కనిపించకుండా చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. పారిస్ ఒలింపిక్స్ టేబుల్ టెన్నిస్ మ్యాచ్ సందర్భంగా ఈ అరుదైన సన్నివేశం కనిపించింది. ఉత్తర దక్షిణ కొరియా ఆటగాళ్లు ఒకరినొకరు పలకరించుకోవడం, షేక్ హ్యాండ్స్ ఇచ్చుకోవడం, సెల్ఫీలు తీసుకోవడం కనిపించింది. ఈ ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.
సౌత్ పారిస్ అరీనాలో జరిగిన టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో విజయం సాధించిన ఇరు జట్లు మెడల్స్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా దక్షిణ కొరియా ఆటగాడు లిమ్ జాంగ్ హూన్ వెంటనే తన సెల్‌ఫోన్ తీసి గ్రూప్ సెల్ఫీ తీశాడు. ఇదే సమయంలో గోల్డ్ మెడల్ అందుకున్న చైనా ఆటగాళ్లు వాంగ్ చూకిన్ మరియు సన్ యింగ్షాలు కూడా జాయిన్ అయ్యారు.ఈ వీడియో వెంటనే ఒలింపిక్స్ కొరియన్ అధికారిక సోషల్ మీడియా అకౌంట్‌లో పోస్టు చేయడం జరిగింది. దీంతో ఇది ఒక సెన్సేషన్‌గా మారింది.
ఇక మ్యాచ్ విషయానికొస్తే ఉత్తరకొరియాకు చెందిన కిమ్ కుమ్-యాంగ్, రిజాంగ్ -సిక్ ద్వయం విజయాన్ని ఒక వేడుకగా జరుపుకున్నారు. 16వ సీడ్ వెండి పతకాన్ని సాధించారు. అంతకుముందు అగ్రశ్రేణి జట్లు అయిన జపాన్ హాంకాంగ్‌లను ఓడించి ఫైనల్స్‌కు చేరుకుంది ఉత్తర కొరియా. ఫైనల్స్‌లో చైనా పై పరాజయం చవిచూసింది.రియో 2016 ఒలింపిక్స్ తర్వాత తొలిసారిగా ఉత్తర కొరియా దేశం ఒలింపిక్స్‌లో పాల్గొంటోంది.ఇదిలా ఉంటే దక్షిణ కొరియా చివరిసారిగా టేబుల్ టెన్నిస్‌లో 2012 లండన్ ఒలింపిక్స్‌లో పతకం సాధించింది.
ఇక పారిస్ ఒలింపిక్స్ 2024లో టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో పతకాలు సాధించిన ఉత్తరకొరియా, దక్షిణకొరియా, చైనా ఆటగాళు పోడియం పై సెల్ఫీలు దిగడాన్ని ప్రపంచ దేశాలు స్వాగతిస్తున్నాయి. దేశాల మధ్య శతృత్వం ఉన్నప్పటికీ దేశాలను ఏకం చేయగల సత్తా ఒక్క క్రీడలకు మాత్రవే ఉందని ఇది మరోసారి నిరూపితమైందని చాలామంది కామెంట్ చేస్తున్నారు. మొత్తానికి పారిస్ ఒలింపిక్స్ రెండు శతృదేశాలను ఏకం చేశాయి. అయితే ఇది వైరి నుంచి స్నేహం వైపు మరులుతుందా లేదా అనేది కాలమే నిర్ణయించాల్సి ఉంటుంది.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**